విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక






హైదరాబాద్ | సంచిక : 07 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూలై 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-




బ్రిటన్, మాల్దీవులలో

## ప్రధాని టూర్

- 25న మాల్దీవులకు..
- వాణిజ్య, ద్వైపాక్షిక ఒప్పందాలు
- మాలే జాతీయ దినోత్సవ వేడుకల్లో చీఫ్ గెస్ట్‌గా హాజరు

న్యూఢిల్లీ ,

ప్రధాని మోదీ రెండు విదేశీ పర్యటనలకు వెళ్లనున్నారు. ఈ నెల 23-26 తేదీల్లో యూకే, మాల్దీవుల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు విదేశాంగ శాఖ వివరాలను వెల్లడించింది. ఇటీవలే ప్రధాని ఐదు దేశాల పర్యటనకు వెళ్లొచ్చారు. కొద్ది రోజుల గ్యాప్‌లనే మరో రెండు విదేశీ పర్యటనలకు వెళ్తున్నారు. 23, 24 తేదీల్లో మోదీ యునైటెడ్ కింగ్‌డమ్‌లో పర్యటించనున్నారు. అక్కడ భారతదేశం-యూకే మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయనున్నారు. ఈ ఒప్పందం ద్వారా భారతీయ ఎగుమతులపై ప్రభావితం అయ్యే అవకాశం ఉంది. ప్రత్యామ్నాయంగా భారతదేశానికి విస్కీ, కార్ల వంటి బ్రిటిష్ ఎగుమతులపై సుంకాలు తగ్గనున్నాయి.

-మిగతా 3 లో




## రాష్ట్రంలో నిర్వహించిన సర్వే

# చరిత్రాత్మకమైంది

### కులగణనతో బీసీల అభ్యున్నతి.. సామాజిక న్యాయం

- తెలంగాణ మెగా హెల్త్ చెకప్‌గా సీఎం అభివర్ణన
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటాం
- ప్రభుత్వానికి నివేదిక అందచేసిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్-ప్రజా స్వేచ్ఛ

రాష్ట్రంలో జరిగిన కులగణన కేవలం డేటా సేకరణ కాదని.. ఇది తెలంగాణ మెగా హెల్త్ చెకప్‌గా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి, సామాజిక న్యాయం అమలు చేసేందుకు కులగణన ఉపయోగపడుతుందన్నారు. కులగణనపై సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని నిపుణుల కమిటీ- ఎంసీహెచ్‌ఆర్‌డీలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. 300 పేజీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. కులాల వారీగా

-మిగతా 3 లో



## రాబోయే పదేండ్లు నేనే సీఎం..

- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి ఫైర్

హైదరాబాద్ - ప్రజా స్వేచ్ఛ

రాబోయే పదేండ్లు నేనే ముఖ్యమంత్రిని అంటూ రేవంత్ రెడ్డి ప్రకటించుకోవడాన్ని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలా ప్రకటించుకోవడం కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకమని చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, అలాంటి ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహించరని ఎక్స్ వేదికగా వెల్లడించారు.రాబోయే పదేళ్లు నేనే ముఖ్యమంత్రి అని రేవంత్ రెడ్డి గారు ప్రకటించుకోవడం

-మిగతా 3 లో

## చురుకుగా నైరుతి రుతుపవనాలు

- తెలంగాణలో పలుచోట్ల వర్షాలు

హైదరాబాద్

నైరుతి రుతు పవనాల ప్రభావంతో తెలంగాణలో రానున్న రెండ్రోజులు భారీ వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణకేంద్రం సంచాలకురాలు కె.నాగరత్న తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మరో ఐదురోజులపాటు- మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. ఈ ఐదు రోజులు ఎల్లో అలర్ట్, మూడో రోజు ఆరెంజ్ హెచ్చరికలు

-మిగతా 3 లో






## హైకోర్టు సిజెగా జస్టిస్ ఆపరేశ్ కుమార్ ప్రమాణం

- రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- సీఎం రేవంత్ తదితరుల హాజరు

హైదరాబాద్

తెలంగాణ హైకోర్టు కొత్త ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్ భవన్ లో మధ్యాహ్నం 12:30 గంటలకు జస్టిస్ ఏకే సింగ్ తో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారు, డీజీపీ, హైకోర్టు న్యాయమూర్తులు, తెలంగాణ మంత్రులు తదితరులు హాజరయ్యారు. కాగా తెలంగాణ హైకోర్టు ఏర్పాటైన తర్వాత జస్టిస్ ఏకే సింగ్ ఏడవ చీఫ్ జస్టిస్ గా నియమితులయ్యారు. త్రిపుర హైకోర్టు సీజేగా పనిచేస్తున్న ఆయన బదిలీపై

-మిగతా 3 లో

## హుజూరాబాద్ అనేక త్యాగాలకు అడ్డా

### పదవుల కోసం ఏనాడు పార్టీ మారలేదు



- బీఆర్ఎస్ నుంచి రావడానికి అనేక కారణాలు
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి అనేకులు కుట్ర
- కొందరు కడుపులో కత్తులు పెట్టుకుని మాట్లాడుతారు
- ఇకనుంచి స్ట్రేట్ ఫైట్..నో స్ట్రీట్ ఫైట్
- హుజూరాబాద్ కార్యకర్తలతో ఈటెల రాజేందర్ వ్యాఖ్యలు

హైదరాబాద్ -ప్రజా స్వేచ్ఛ

హుజూరాబాద్ అనేక త్యాగాలకు అడ్డా అని బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హుజూరాబాద్ నుంచే అనేక పోరాటాలు చేశామన్నారు. కొందరు సామాజిక మధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి నుంచి బయటికి రావడానికి అనేక కారణాలు ఉన్నాయని చెప్పారు. తాను పదవుల కోసం పార్టీ మారలేదని చెప్పారు. హైదరాబాద్‌లోని శామీర్‌పేటలో హుజూరాబాద్ భాజపా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సీఎంగా

-మిగతా 3 లో



## బ్రిక్స్‌దేశాలపై మళ్లీ నోరుపారేసుకున్న ట్రంప్..!

- బ్రిక్స్ సభ్యదేశాలపై 10శాతం ఎగుమతి పన్ను విధించే అవకాశం
- విలేకరుల సమావేశంలో ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్ ప్రజా స్వేచ్ఛ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి బ్రిక్స్ పై నోరుపారేసుకున్నారు. బ్రిక్స్‌ను చిన్న సహాయం అని పేర్కొంటూనే.. డాలర్‌కు ప్రత్యామ్నాయంగా సొంత కరెన్సీని ప్రవేశపెట్టాలని చూస్తోందని వ్యాఖ్యానించారు. ట్రంప్ బ్రిక్స్ సభ్యదేశాలపై 10శాతం ఎగుమతి పన్ను విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. గత పది రోజుల్లో ట్రంప్ హెచ్చరించడం ఇది రెండోసారి. బ్రిక్స్ దేశాల్లో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణ

-మిగతా 3 లో



## భారత్‌పై మరోసారి విషం..

- పహల్గాం ఘటనలో టీఆర్ఎఫ్ పాత్రపై రుజువులు ఉన్నాయా అని పాక్ ప్రశ్న

న్యూఢిల్లీ

పాకిస్థాన్ ప్రభుత్వం భారత్‌పై మరోసారి విషాన్ని కక్కింది. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన లష్కరే తాయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)ను అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించిన నేపథ్యంలో శనివారం జరిగిన పార్లమెంట్ సమావేశంలో ఆ దేశ విదేశాంగ మంత్రి ఇషాక్‌దార్ టీఆర్ఎఫ్ పూర్తిగా సమర్థిస్తున్నట్టు ప్రకటించారు. పహల్గాం ఘటనలో 26 మందిని టీఆర్ఎఫ్‌ను బలి గొన్నట్టుగా ఏమైనా రుజువులు ఉన్నాయా అని ప్రశ్నించారు.

-మిగతా 3 లో

## ఆర్థిక నేరగాళ్లా కాంగ్రెస్‌ను విమర్శించేది?



- పదేళ్లు దోపిడీ చేసిన వారికి మాట్లాడే హక్కు లేదు
- కెటిఆర్ తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

హనుమకొండ, ప్రజా స్వేచ్ఛ

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌కు జైలు జీవితం తప్పదని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. అవినీతిలో కూరుకు పోయి, ఆర్థిక అవతవకలకు పాల్పడిన వారు అదేపనిగా ప్రభుత్వంపైనా, సిఎం రేవంత్‌పైనా విమర్శలు చేస్తే

-మిగతా 3 లో


## రాజ్యసభ ముందుకు 13 బిల్లులు

- వీటిలో 8 కొత్తవి

న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ


పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభ ముందుకు 13 బిల్లులు ఆమోదం కోసం రానున్నాయి. ఈ జాబితాను రాజ్యసభ సెక్రటేరియట్ శనివారం విడుదల చేసింది. 13 బిల్లుల్లో 8 బిల్లులు కొత్తవి. మిగిలినవి ఇప్పటికే లోక్‌సభ ఆమోదించిన బిల్లులు, లేదా దిగువ సభలో ప్రవేశపెట్టిన బిల్లులు. సరుకు

-మిగతా 3 లో



# హైజాకర్లకు ఆశ్రయమిచ్చేవారికి మరణ శిక్ష రద్దు

**తీవ్రవాదులపై మరోసారి ప్రేమ చాటుకున్న పాక్**




**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**

ఉగ్రవాదానికి ఊతమిస్తూ, వారికి నిత్యం అండగా ఉండే పాకిస్థాన్ బహిరంగంగానే వారిపై తన ప్రేమను చాటుకుంది. తీవ్రవాదులకు, హైజాకర్లకు ఆశ్రయం కల్పించిన వారికి ఇప్పటివరకు విధిస్తున్న మరణ శిక్షను రద్దు చేసింది. ఈ మేరకు పాక్ సెనేట్ దానికి ఆమోదముద్ర వేసింది.

# అగ్నివీర్‌లకు మానసిక పరీక్ష తప్పనిసరి




**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**

భారత ఆర్మీలో చేరేందుకు నిర్వహించే అగ్నివీర్ పరీక్షలో భాగంగా సైకాలజికల్ టెస్ట్‌ను తప్పనిసరి చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు నుంచి నిర్వహించే పరీక్షల్లో శారీరక ధృఢత్వ పరీక్షతో పాటు ముందుగా 15 నిమిషాల ఆన్‌లైన్ సైకాలజికల్ టెస్ట్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ కొత్త నిబంధనను మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్, చంబల్, బుందేల్‌ఖండ్‌లలో నిర్వహించే అగ్నివీర్ ర్యాలీల్లో ప్రవేశపెట్టారు. రక్షణ శాఖ పరిధిలోని సైకాలజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ టెస్ట్‌ను నిర్వహించనున్నారు.

# 5 యుద్ధ విమానాలు కూలిపోయాయి..

**భారత్-పాక్ దాడులపై ట్రంప్ వ్యాఖ్యలు**




**వాషింగ్టన్ - ప్రజా స్వేచ్ఛ**

భారత్, పాకిస్థాన్ మధ్య మే నెలలో జరిగిన దాడుల సందర్భంగా 4-5 యుద్ధ విమానాలు కూలిపోయాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. వ్యాపార ఆశలు చూపించి రెండు అణ్వస్త్ర దేశాల మధ్య కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించానని మరోసారి ఆయన ప్రకటించారు. శుక్రవారం వైట్‌హౌస్‌లో కొందరు రిపబ్లికన్ పార్టీ ఎంపీలకు ఇచ్చిన విందులో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. గాలిలోనే నాలుగైదు యుద్ధ విమానాలు కూల్చివేతకు గురయ్యాయని, బహుశా ఐదు విమానాలు కూలిపోయినట్లు తాను భావిస్తున్నానని ట్రంప్ చెప్పారు.

## వేలంలో రూ.263కోట్లు పలికిన డైనోసర్ శిలాజం..!

**వాషింగ్టన్ ప్రజా స్వేచ్ఛ**



ఇటీవల న్యూయర్క్ నగరంలో నిర్వహించిన వేలంలో ఒక అరుదైన డైనోసార్ శిలాజం వేలంలో రికార్డు స్థాయి ధర పలికింది. ప్రపంచ ప్రసిద్ధ సోథ్ బీ సంస్థ నిర్వహించిన ఈ వేలంలో డైనోసార్ శిలాజం 30.5 మిలియన్ డాలర్లకు అమ్ముడుపోయింది. ఇది భారతీయ కరెన్సీలో దాదాపు రూ.263 కోట్లు. ఈ శిలాజం వేలం ప్రారంభమైన వెంటనే కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ శిలాజం కోసం కొనుగోలుదారుల మధ్య తీవ్రమైన పోటీ ఏర్పడింది. చివరకు ఈ విలువైన డైనోసార్ శిలాజాన్ని ఓ వ్యక్తిని సొంతం చేసుకున్నారు. అయితే, సంస్థ సదరు వ్యక్తి పేరును రహస్యంగా ఉంచింది. ఈ శిలాజం జురాసిక్ యుగానికి చెందిందిగా భావిస్తున్నారు. దాదాపు 150 మిలియన్ సంవత్సరాల ప్రాచీనమైన శిలాజంగా అంచనా. ఇది ప్రపంచంలో అత్యధిక ధర పలికిన డైనోసార్ అస్థిపంజరాలలో మూడవ స్థానాన్ని సాధించింది. గత ఏడాది జూలైలో 'అపెక్స్' అనే డైనోసార్ శిలాజం 44.6 మిలియన్ డాలర్లకు అమ్ముడైంది. భారతీయ కరెన్సీలో అక్షరాలా రూ.380 కోట్లు. ఆ సమయంలో ప్రపంచంలోనే అత్యధిక ధర పలికిన శిలాజంగా రికార్డులకెక్కింది. ఈ శిలాజం శాస్త్రవేత్తలు, పరిశోధకులకు విలువైన సమాచారం అందించే అవకాశం దక్కనున్నది.

# లైంగిక వేధింపులు బాలికలను నిరుత్సాహపరుస్తున్నాయి

**ప్రియాంక గాంధీ**



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

నోయిడాలోని వైద్య విద్యార్థి ఆత్మహత్యపై ప్రియాంక గాంధీ స్పందించారు. లైంగిక వేధింపులతో దేశవ్యాప్తంగా బాలికలను చదువుల్లో నిరుత్సాహపరుస్తున్నారని ఆమె ఆవేదన వక్తం చేశారు. ఒడిశాలో బలవంతంగా బీఈడీ విద్యార్థి సూసైడ్ చేసుకునేలా చేశారని, అదే తరహాలో ఘటన నోయిడాలోని శారద యూనివర్సిటీలో చోటుచేసుకుందని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. "ఉపాధ్యాయులు వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. మన విద్యాసంస్థలు మన పిల్లలకు సురక్షితంగా లేవా? జీవితమే సురక్షితంగా లేని చోట వారు మెరుగైన జీవితం గురించి ఎలా కలలు కంటారు? జీవితంలోని ప్రతి దశలోనూ ముందుకు సాగడానికి బాలికలు రెండింతలు పోరాటాన్ని ఎదుర్కొంటారు. ఇలాంటి సంఘటనలు దేశవ్యాప్తంగా బాలికలను నిరుత్సాహపరుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ కేసులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని, అలాంటి సంఘటనలను నివారించడానికి ఖచ్చితమైన చర్యలు తీసుకోవాలని" ఆమె డిమాండ్ చేశారు. ఒడిశాలో లెక్చరర్ లౌంగిక వేధింపులు భరించలేక బీఈడీ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అదే తరహాలో అధ్యాపకుల వేధింపులు తట్టుకోలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన గ్రేటర్ నోయిడాలో జరిగింది. పోలీసుల కథనం మేరకు . నోయిడాలోని శారదా విశ్వవిద్యాలయంలో ఓ విద్యార్థిని బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జన్ రెండో సంవత్సరం చదువుతుంది. గత శుక్రవారం రాత్రి ఆమె క్యాంపస్‌లోని బాలికల హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకోగా, తోటి విద్యార్థులు సమాచారం ఇవ్వడంతో వెంటనే సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

# మోడీ రాజ్యాంగాన్ని హత్య చేశారు


**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**



శనివారం మైసూర్‌లోని మహారాజా కళాశాల మైదానంలో 'సాధన సమావేశం' జరిగింది. మైసూరుకు రూ. 2,500 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం కోసం కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం సాధన సమావేశ నిర్వహించింది. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె శివకుమార్‌తోపాటు పలవురు మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ పార్టీలో ప్రజలు ప్రదర్శిస్తారు. మోడీ బిజెపిలో ప్రజలు మాట్లాడతారు' అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ రాజ్యాంగాన్ని హత్య చేశారని ఖర్గే ఆరోపించారు. అయితే భారత ప్రజలు బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగాన్ని మార్చడానికి అనుమతించరు అని ఆయన నొక్కి చెప్పారు. రాజ్యాంగాన్ని సవరించడం లేదా, తిరిగి రాయడం గురించి బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు పదేపదే మాట్లాడుతున్నాయి. మీరు ఎంత ప్రయత్నించినా, ఈ దేశ ప్రజలు రాజ్యాంగాన్ని మార్చడానికి మిమ్మల్ని అనుమతించరు. ఒకవేళ మీరు (ప్రజలు) రాజ్యాంగాన్ని మార్చడానికి వారిని అనుమతిస్తే మీకు ఎటువంటి హక్కులు ఉండవు అని ఖర్గే ప్రజలను హెచ్చరించారు. మిస్టర్ మోడీ మీరు రాజ్యాంగం కారణంగానే ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి అయ్యారు. పార్లమెంటులోకి ప్రవేశించే ముందు మీరు రాజ్యాంగానికి నమస్కరించారు. కానీ ఇప్పుడే అదే మోడీ రాజ్యాంగాన్ని హత్య చేస్తున్నారు. ప్రతిరోజూ, బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు ఈ రాజ్యాంగాన్ని తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి అని ఖర్గే అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచంలో 42 దేశాలను సందర్శించారు. కానీ.. సంఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపూర్‌ను మాత్రం ఇప్పటివరకు ఆయన సందర్శించలేదు అని ఆయన విమర్శించారు.

# ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా

**కీవ్ తదితర ప్రాంతాలపై డ్రోన్లు, క్షిపణులతో ఆపరేషన్‌ఉక్రెయిన్ అధికారుల వెల్లడి**



**కీవ్- ప్రజా స్వేచ్ఛ**

అమెరికా అండదండలతో రష్యాపై ఒంటికాలిపై లేస్తున్న ఉక్రెయిన్‌పై రష్యా మరోమారు సైనిక ఆపరేషన్‌కు ఉపక్రమించింది. రష్యా అధ్యక్షుడి భవనం క్రెమ్లిన్ కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు సాగిస్తుండగా.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే ఉసిగొల్పుతూ పరిస్థితిని ఉద్రిక్తతంగా మారుస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌లోని కీవ్ సహా పలు ప్రాంతాల్లో రష్యా సైనిక బలగాలు విరుచుకుపడ్డాయని ఉక్రెయిన్ సైనికాధికారులు తెలిపారు. కీవ్‌పై 300కు పైగా డ్రోన్లు, 30 పైగా క్షిపణులతో దాడులు జరిగినట్లు వారు పేర్కొన్నారు. ఈ దాడిలో అనేక నివాస భవనాలు, ఆస్పత్రులు, వాహనాలు ధ్వంసమైనట్లు తెలిపారు. భవనాల శిథిలాల కింద అనేక మంది ప్రజలు చిక్కుకున్నారని.. వారిని బయటకు తీసుకొచ్చేందుకు భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు. రష్యన్ దళాలు ఉక్రెయిన్‌లోని ఒడెసా నగరంపై 20కి పైగా డ్రోన్లు, పదుల సంఖ్యలో క్షిపణులు ప్రయోగించడంతో ఒకరు ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్ర గాయాలపాలైనట్లు ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. కాగా ఉక్రెయిన్‌కు ఆస్ట్రేలియా కూడా ఆయుధాలు సమకూరుస్తోంది. ఇందులో భాగంగా శనివారం కీవ్‌కు ఎం1ఎ1 అబ్రమ్స్ యుద్ధ ట్యాంకులను అందజేసింది. ఇతర ఆయుధ సామగ్రిని త్వరలోనే అందజేస్తామని ఆస్ట్రేలియా రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్ వెల్లడించారు.

# ఒడిశాలో మరో దారుణం. విద్యార్థినికి నిప్పంటించిన ఆగంతకులు

**హైదరాబాద్: - ప్రజా స్వేచ్ఛ**



ఇటీవల ప్రొఫెసర్ లైంగిక వేధింపులు తట్టుకోలేక ఓ విద్యార్థిని నిప్పంటించుకుని ఆత్మాహుతికి పాల్పడింది. ఈ ఘటన మరువకముందే ఒడిశాలో మరో దారుణం చోటుచేసుకుంది. ఇంటర్ చదివే బాలికకు ముగ్గురు నిప్పంటించారు. తీవ్ర గాయాల పాలైన ఆ బాలికను ఒడిశా ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ బాలిక పరిస్థితి విషమంగా ఉందని పోలీసు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఒడిశాలోని పూరీ జిల్లాలో బయాబర్ గ్రామంలో జరిగింది. ఈ గ్రామానికి చెందిన ఇంటర్ చదివే ఓ బాలిక తన స్నేహితురాలికి బుక్స్ ఇచ్చేందుకు శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో బాధితురాలు తన ఇంటికెళ్తుంది. స్నేహితురాలి ఇంటికి వెళ్తున్న ఆ అమ్మాయిని భార్గవి నది సమీపంలోని నిర్జన ప్రదేశంలో ముగ్గురు వ్యక్తులు ఆమెను అడ్డుకుని.. నిప్పంటించి పారిపోయారు. మంటల్లో కాలుతూ అరుస్తున్న బాలికను స్థానికులు చూసి.. వెంటనే మంటల్ని ఆర్పేందుకు ప్రయత్నించారు. తొలుత పిపిలీలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం ఒడిశాలోని ఎయిమ్స్‌కి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ ఘటనపై బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను అదుపు చేయడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రంలో బాలికల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. లెక్చరర్ లైంగిక వేధింపుల కారణంగా మరణించిన సౌమ్యశ్రీకి..న్యాయం అందించడంలో బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వహించిందని, బాధితురాలు న్యాయం కోసం పోరాడి చివరకు కాలేజీలోని సజీవ దహనమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా, శిశు అభివృద్ధి శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ఒడిశా ఉప ముఖ్యమంత్రి ప్రవతి పరిదా ఈ ఘటనపై స్పందించారు. ఈ ఘటనపై ఆమె విచారం వ్యక్తం చేశారు. బాలిక చికిత్స ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని ఆమె వెల్లడించారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి.. కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు.

# రాష్ట్రంలో నిర్వహించిన సర్వే చరిత్రాత్మకమైంది

(మొదటి తరువాయి)

వెనుకబాటుతనాన్ని విశ్లేషించిన కమిటీ-.. కొత్త పాలసీలతో పాటు ప్రస్తుత విధానాలను మెరుగుపరిచేందుకు అవసరమైన సూచనలను నివేదికలో పొందుపర్చింది. కమిటీ సూచనలపై కేబినెట్‌లో చర్చించి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోనుంది. వెనుకబాటుతనంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య తేడాలు, వాటికి కారణాలను కూడా అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్వహించిన సర్వే చరిత్రాత్మకమైందని.. దేశానికి రోల్ మోడల్‌గా మారుతుందని నిపుణుల కమిటీ అభిప్రాయపడింది. రాష్ట్రంలో చేపట్టిన కులగణనను అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ- ప్రభుత్వానికి తమ నివేదికను సమర్పించింది. ఎంసీహెచ్ఆర్డీలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో ఇండిపెండెంట్ ఎక్స్పర్ట్ వర్కింగ్ గ్రూప్ చైర్మన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి అధ్వర్యంలోని నిపుణులు సమావేశమయ్యారు. సీఎంతో పాటు- డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు సిఎం ముఖ్య కార్యదర్శి వి. శేషాద్రి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సాంఘీక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఈ.శ్రీధర్, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఏ. శరత్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వర్కింగ్ గ్రూప్ చైర్మన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కంచె అయిలయ్య, సభ్యులు ప్రొఫెసర్ శాంతా సిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, డా. సుఖదేవ్ తొరాట్, నిఖిల్ డే, ప్రొఫెసర్ భాంగ్య భూక్య, ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, ప్రొఫెసర్ జీన్ డ్రెజ్, ప్రొఫెసర్ థామస్ పికెట్టి, ప్రవీణ్ చక్రవర్తి, సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి ఈ సందర్భంగా తమ నివేదికను అందించారు. ఈ సర్వే సైంటిఫిక్ అని నిరూపిత మైందని, తెలంగాణ నిర్వహించిన సర్వే చరిత్రాత్మకమని, దేశానికి రోల్ మోడల్ గా మారుతుందని నిపుణుల కమిటీ- అభిప్రాయపడింది. నిపుణుల కమిటీ- సమర్పించిన నివేదికలోని అంశాలను, సూచనలను కేబినెట్ లో చర్చించి ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటు-ంది. సామాజిక న్యాయం, అన్ని వర్గాల సాధికారత లక్ష్యంగా దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, కుల సర్వేను నిర్వహించింది. మొదటి దశలో 2024 నవంబర్ 6వ తేదీ నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకు 50 రోజుల పాటు- రాష్ట్రమంతటా సర్వే నిర్వహించింది. రాష్ట్రంలో ఉన్న మొత్తం జనాభాకు చెందిన సమాచారం సేకరించేందుకు ప్రతి జిల్లాలో ప్రతి 150 కుటుంబాలను ఒక బ్లాక్ గా ఎంచుకుంది. ఒక్కో బ్లాక్ కు ఒక ఎన్యుమరేటర్ను, ప్రతి 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్వైజర్ను నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా 1,03,889 మంది ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లతో శాస్త్రీయంగా సర్వే చేయించింది. మొదటి విడతలో రాష్ట్రంలో రాష్ట్రంలో 96.9 శాతం కుటు-ంబాలను సర్వే చేసి ఆయా కుటుంబాల వివరాలను 36 రోజుల్లో డేటా ఎంట్రీ- చేయించింది. మొదటి దశలో హౌస్ లిస్టింగ్ చేసిన కుటు-ంబాలు కొన్ని వేర్వేరు కారణాలతో సర్వేలో తమ వివరాలు నమోదు చేయకపోవటంతో ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు రెండో విడతలో వివరాల నమోదుకు అవకాశం కల్పించింది. మీ సేవా కేంద్రాలు, జీహెచ్ఎంసీ, ఎంపీడీవో ఆఫీసులు, వెబ్సైట్ ద్వారా తమ వివరాలకు నమోదు చేయించింది. ఈ సర్వే వివరాల నివేదికను ప్రభుత్వం అసెంబ్లీకి సమర్పించింది. సర్వే ఫలితాలను అధ్యయనం చేసి విధాన నిర్ణయాలను రూపొందించేందుకు వీలుగా సర్వే డేటాను విశ్లేషించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి సుదర్శన్ రెడ్డి అధ్వర్యంలో 11 మంది సభ్యులతో స్వతంత్య్ర నిపుణుల వర్కింగ్ గ్రూప్ను ఏర్పాటు చేసింది. సర్వే ఫలితాలను విశ్లేషించి వివరణాత్మక నివేదికను అప్పగించే బాధ్యతను ఈ నిపుణుల కమిటీకి అప్పగించింది. వివిధ దఫాలుగా సమావేశాలు జరిపిన కమిటీ- డేటాను సేకరించిన పద్ధతి నిశితంగా ఉందని గుర్తించింది. ప్రభుత్వ విధానాల రూపకల్పనతో పాటు- ఇప్పుడు అమల్లో ఉన్న విధానాలను మెరుగుపరిచేందుకు, సామాజిక న్యాయం, సామాజిక సాధికారత మరియు వెనుకబడిన బలహీనవర్గాల వర్గాల అభ్యున్నతిని మెరుగుపరిచేందుకు సహాయపడుతుందని సూచించింది.

# హుజూరాబాద్ అనేక త్యాగాలకు అడ్డా

(మొదటి తరువాయి)

ఉన్న కేసీఆర్‌కు నా నిర్ణయాలు మొహమాటం లేకుండా చెప్పాను. గతంలో హుజూరాబాద్ ఉపఎన్నికల్లో ప్రజల ఆత్మగౌరవం గెలిచింది. నేను అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా. గతంలో హుజూరాబాద్ అసెంబ్లీ ఎన్నికల్లో నా ఓటమికి చాలా మంది కుట్రలు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నా అడుగు పడని గ్రామాలు లేవు. నేను పోరాటాలు చేస్తే కరీంనగర్ ప్రజలు అండగా ఉండేవారు. హుజూరాబాద్ గడ్డలో ప్రతి గ్రామంలోని వార్డు సభ్యుడిని గెలిపిస్తామని ఈటల తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటానని, వారిని కడుపులో పెట్టుకుని కాపాడు కుంటానని అన్నారు. ఇదే సందర్భంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌కి పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. హుజురాబాద్‌లో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శామీర్‌పేట్‌లోని ఈటెల రాజేందర్ ఇంటికి శనివారం కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి రాజేందర్ మాట్లాడారు. హుజురాబాద్ తెలంగాణ ప్రతీకకు అడ్డా అని ఉద్ఘాటించారు. ఇక నుంచి అక్కడ స్టేట్ ఫైట్ ఉంటుందని.. స్ట్రీట్ ఫైట్ మాత్రం ఉండదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో అవమానాలు, అవహేళనలను దాటి తాను ముందుకు వచ్చానని చెప్పుకొచ్చారు. అప్పుడు కేసీఆర్ తన విషయంలో చేసింది అదేనని గుర్తుచేశారు. అయినా హుజురాబాద్ బిడ్డలు తనను కాపాడుకున్నారని ఉద్ఘాటించారు. తాను అలాగే వారిని కాపాడుకుంటానని మాటిచ్చారు. దక్షిణ భారతదేశంలో తన నియోజకవర్గానికి నేరుగా వచ్చి ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమావేశం పెట్టారని ఎంపీ ఈటెల రాజేందర్ గుర్తుచేశారు. శత్రువుతో కొట్లాడవచ్చు కానీ కడుపులో కత్తులు పెట్టుకొనే వారితో పోరాటం చేయలేమని విమర్శించారు. భారతీయ జనతా పార్టీలో అన్నిరకాల అంశాలని పరిగణనలోకి తీసుకుంటారనే ఈ పార్టీలో చేరానని చెప్పుకొచ్చారు. తెలంగాణలో తాను తొక్కని ఇంటి గడప లేదని.. తనకు తెలియని వారు లేరని... బీసీ బిడ్డగా తాను మంత్రి పదవులు పొందానని గుర్తుచేశారు. వీరుడు ఎక్కడ భయపడడు. హుజురాబాద్ గడ్డ మీద తన ప్రతి అనుచరుడు ఉంటారని వెల్లడించారు. తన సర్పంచులు, ఎంపీటీసీలు, తన వార్డ్ మెంబర్లు కూడా ఉంటారని తెలిపారు. దేశ ప్రధాని వ్యక్తుల కోసం కాకుండా వ్యవస్థ నిర్మాణం కోసం పని చేస్తున్నారని చెప్పారు. మనమంతా దేశ ధర్మం కోసం కట్టుబడి పని చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో కొంతమంది ఉంటారని.. ఇతరులను ఎదగనివ్వకుండా చేయడమే వాళ్ల పని విమర్శించారు. కచ్చితంగా హుజురాబాద్ వస్తా.. మీ వెంట ఉంటానని హామీ ఇచ్చారు. తనను ఏడుసార్లు గెలిపించారని... ఎవరికీ భయపడేది లేదని రాజేందర్ స్పష్టం చేశారు. రాజకీయాల్లో చిన్న మనస్కులు, కురుస మనస్తత్వం ఉన్న వాళ్లు ఉంటారని తెలిపారు. వాళ్ల కడుపులో కత్తులు పెట్టుకొని ఉంటారుని.. అలాంటిది వారితో యుద్ధం చేయడం కష్టమే కానీ ఎదురెళ్లి నిలబడాలని చెప్పుకొచ్చారు. ఇక నుంచి హుజురాబాద్‌లో ప్రతి మండలానికి ఒక కార్యాలయం ఉంటుందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రులు రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ,కేసీఆర్ లాంటి వాళ్లతో తాను కొట్లాడానని గుర్తుచేశారు. సముద్రంలో తుఫాన్ వచ్చే ముందు సైలెంట్‌గా ఉంటదని చెప్పుకొచ్చారు. తన లాంటి వాళ్లు మాట్లాడితే సమాజం రియాక్ట్ అవుతుందని.. తాను ప్రజల నుంచి వచ్చిన వాడినని, ప్రజలే తనకు న్యాయ నిర్ణేతలని ఈటెల స్పష్టం చేశారు.

# ఆర్థిక నేరగాళ్లా కాంగ్రెస్‌ను విమర్శించేది?

(మొదటి తరువాయి)

సహించేది లేదని హెచ్చరించారు. కెటిఆర్ తీరు మార్చుకోకపోతే తగిన బుద్ధిచెబుతామని కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హెచ్చరించారు. వరంగల్‌కు ఇచ్చిన హామీలను మరిచిన దొంగ కేటీఆర్ అని విమర్శించారు. తమ ప్రభుత్వం చేసే అభివృద్ధి కేటీఆర్‌కి కనిపించడం లేదా... కళ్లు కనిపించకపోతే డాక్టర్ వద్దకు తీసుకుపోతానని నాయిని రాజేందర్ రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం హనుమకొండలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ తదితరులు రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పదేళ్లలో తెలంగాణకు ఏం చేశారని ప్రశ్నించారు. పదిమంది లంపెన్ గ్యాంగులతో కేటీఆర్.. కాంగ్రెస్ నేతలపై దాడులకు దిగుతున్నారని నాయిని రాజేందర్ రెడ్డి ఆరోపించారు . తాము తలచుకుంటే రోడ్లపై కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు తిరగలేరని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే చూస్తు ఊరుకోమని వార్నింగ్ ఇచ్చారు. రేవంత్‌రెడ్డికి సీఎం పదవి రాకముందు దూకుడుగా ఉండేవాళ్లమని... ఇప్పుడు తమ చేతులని హై కమాండ్ కట్టేస్తోందని చెప్పుకొచ్చారు. బీజేపీతో బీఆర్ఎస్ పొత్తుపై మీ చెల్లె కవిత చెప్పింది నిజం కాదా అని ఎమ్మెల్యే నాయిని ప్రశ్నల వర్షం కురిపించారు. మాజీమంత్రి కేటీఆర్ డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని కాంగ్రెస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు విమర్శించారు. శవాలపై పేలాలు ఏరుకునే రకం కేటీఆర్ అని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి జోలికి వస్తే ఊరుకోమని హెచ్చరించారు. కేటీఆర్ ఆర్థిక నేరస్తుడని.. ఆయన కుటుంబం అంతా నేరపూరితమైందని ఆరోపించారు. మాజీ మంత్రి అర్కె రోజా రొయ్యల పులుసుకు మీ నాన్న కేసీఆర్ అలవాటు- పడితే.. నువ్వు లెగ్గులు,పెగ్గులకు అలవాటు పడ్డావని ఎద్దేవా చేశారు.

# రాజ్యసభ ముందుకు 13 బిల్లులు

(మొదటి తరువాయి)



రవాణా బిల్లులు, సముద్రం ద్వారా వస్తువులను రవాణా చేసే బిల్లు, కోస్టల్ షిప్పింగ్ బిల్లులను ఇదివరకే లోక్‌సభ ఆమోదించింది. వీటిని ఇప్పుడు రాజ్యసభలో ఆమోదం కోసం జాబితాలో చేర్చారు. అలాగే గోవా రాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాలలో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్వ్యవస్థీకరణ బిల్లు, ఆదాయపు పన్ను బిల్లులను లోక్‌సభలో ఇప్పటికే ప్రవేశపెట్టారు.. ఆ బిల్లులను కూడా వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. ఇవి కాకుండా మరో 8 కొత్త బిల్లులను రాజ్యసభలో ప్రవేశపెట్టేందుకు సిద్ధం చేశారు. ఆ బిల్లులు..1. మణిపూర్ వస్తువులు, సేవల పన్ను సవరణ బిల్లు, 2. జన్ విశ్వాస్ నిబంధనల సవరణ బిల్లు, 3. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సవరణ బిల్లు, 4. పన్ను చట్టాల సవరణ బిల్లు, 5. జియోహెరిటేజ్ సైట్స్, జియో రెలిక్స్ సంరక్షణ, నిర్వహణ బిల్లు
6. గనులు, ఖనిజాభివృద్ధి, నియంత్రణ సవరణ బిల్లు, 7. నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లు, 8. జాతీయ డోపింగ్ నిరోధక సవరణ బిల్లు.

# భారత్‌పై మరోసారి విషం..

(మొదటి తరువాయి)

ఉంటే చూపించాలని భారత్‌తో సహా అమెరికాను కోరుతున్నట్టు తెలిపారు. అమెరికా టీఆర్ఎఫ్‌ను అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థగా పరిగణించడాన్ని ఆయన తప్పుబట్టారు.

### బ్రిటన్, మాల్దీవులలో
# ప్రధాని టూర్

(మొదటి తరువాయి)

**25న మాల్దీవులకు..**

25-26 తేదీల్లో ప్రధాని మాల్దీవుల్లో పర్యటించనున్నారు. గతేడాది ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతిన్నాయి. ప్రధానిపై మాల్దీవుల మంత్రులు నోరుపారేసుకున్నారు. దీంతో భారతీయ టూరిస్టులు.. మాల్దీవులు వెళ్లేందుకు నిరాకరించారు. ఈ నష్టాన్ని గుర్తించిన మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు దిగొచ్చారు. గతేడాది ఢిల్లీలో జరిగిన మోదీ ప్రమాణస్వీకారానికి మాల్దీవుల అధ్యక్షుడు హాజరయ్యాడు. మొత్తానికి రాజకీయ ఉద్రిక్తతల తర్వాత భారత ప్రధాని మాల్దీవుల్లో పర్యటించడం ఇదే తొలిసారి. అంతేకాకుండా మొహమ్మద్ ముయిజ్జు మాల్దీవుల అధ్యక్షుడు అయ్యాక మోదీ పర్యటించడం కూడా ఇదే ప్రథమం.

# రాబోయే పదేండ్లు నేనే సీఎం..

(మొదటి తరువాయి)

కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకం. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ లో అధిష్ఠానం ఆదేశాల మేరకు, ప్రజాస్వామ్యబద్ధంగా ముఖ్యమంత్రి ఎన్నిక ఉంటుంది. తెలంగాణ కాంగ్రెస్ ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహించరు.' అంటూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి ట్వీట్ చేశారు.

# చురుకుగా నైరుతి రుతుపవనాలు

(మొదటి తరువాయి)

జారీ చేసినట్లు చెప్పారు. తెలంగాణలోని వికారాబాద్, రంగారెడ్డి, ములుగు, భద్రాద్రి, జయశంకర్, జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు తెలిపారు. ఈ ఏడాది షెడ్యూల్ కంటే ముందుగానే నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించినప్పటికీ ఆశించిన వర్షాలు కురవలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు విత్తనాలు వేసి వర్షం కోసం ఎదురుచూశారు. వర్షాలు కురవాలని పూజలు చేశారు. ఎట్టకేలకు వరుణ దేవుడు కరుణించాడు. తెలంగాణలో కుండపోత వానలు కురుస్తున్నాయి. శుక్రవారం అత్యధిక వర్షపాతం నమోదైంది. ఆకాశానికి చిల్లుపడినట్లుగా కుండపోత వానలు కురిశాయి. రోడ్లు కాలువలను తలపించాయి. లోతట్టు- ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. ఈ క్రమంలో వాతావరణ శాఖ గుడ్ న్యూస్ అందించింది. తెలంగాణలో ఇక విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. నైరుతి రుతుపవనాలు తిరిగి యాక్టివ్ అయినట్లు- తెలిపింది. మరో రుతుపవన ద్రోణి ఏర్పడే అవకాశం ఉందని.. మరో ద్రోణి ఏర్పడితే భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. రాబోయే నాలుగు రోజుల పాటు- తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురువనున్నట్లు- తెలిపింది. ఈశాన్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న రుతుపవన ద్రోణి.. దక్షిణ కోస్తా మీదుగా కొనసాగుతున్న ఉపరితల చక్రవహాక ఆవర్తనం.. నేడు తెలంగాణ తీరానికి దగ్గరగా ద్రోణి.. దక్షిణ తెలంగాణ జిల్లాల్లో నేడు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. భారీ వర్షాలు కురిసే అవకాశం.. ఉండడంతో హైదరాబాదీలు అలెర్ట్ గా ఉండాలని ఐఎండీ సూచన.. జీహెచ్ఎంసీ.. డీఆర్ఎఫ్ తో పాటు- సంబంధిత అధికారులను అలెర్ట్ చేసింది.

# బ్రిక్స్‌దేశాలపై మళ్లీ నోరుపారేసుకున్న ట్రంప్..!

(మొదటి తరువాయి)

ఆఫ్రికా ఉన్నాయి. వైట్ హౌస్‌లో జరిపిన విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. 'జీనియస్ యాక్ట్' అనే మొదటి క్రిప్టోకరెన్సీ బిల్లుపై సంతకం చేసిన కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ ఈ బిల్లు స్టేబుల్ కాయిన్ క్రిప్టోకరెన్సీకి నియంత్రణ చట్రాన్ని అందిస్తుందన్నారు. జులై 6-7 తేదీల్లో రియో డిజెనెరోలో బ్రిక్స్ సమ్మిట్ జరిగిన విషయం తెలిసిందే.అయితే, ఈ సమ్మిట్‌లో బ్రిక్స్ దేశాలు కీలక ప్రకటన చేశాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ నియమాలకు విరుద్ధంగా అమెరికా పన్నులు పెంచడంతో ప్రపంచ వాణిజ్యానికి ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఆ మరుసటి రోజే ట్రంప్ అమెరికాకు ముప్పు తలపెట్టేందుకు బ్రిక్స్‌ను స్థాపించారని.. డాలర్‌ను బలహీనపరిచేందుకు ఆ దేశాలు ప్రయత్నిస్తున్నాయని.. ఆ దేశాలన్నీ పదిశాతం పన్నులుంటాయని హెచ్చరించారు. తాజాగా ట్రంప్ మరోసారి ఈ అంశంపై స్పందించారు. 'బ్రిక్స్ దేశాలు సమావేశమైతే చాలా మంది దేశాధినేతలు పన్నుల భయంతో ఆ సమావేశానికి హాజరుకాలేదు. ఇది ఆశ్చర్యకరమైన విషయం. నాతో ఉంటే, డాలర్ బలహీనపడదు. నేను డాలరు దిగజారకుండా ఉంచుతా'నన్నారు. ఇదిలా ఉండగా.. భారత-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం పై 5వ దశ చర్చలు 17న వాషింగ్టన్‌లో ముగిశాయి. ఈ చర్చలకు భారత ప్రధాని ప్రధాన ప్రతినిధి, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ నేతృత్వం వహించారు.

# హైకోర్టు సిజెగా జస్టిస్ ఆపరేశ్ కుమార్ ప్రమాణం

(మొదటి తరువాయి)

తెలంగాణకు వచ్చారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన జస్టిస్ సుజయ్ పాల్ కోల్ కతా హైకోర్టుకు బదిలీ అయ్యారు. జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ 1965 జులై 7న జన్మించారు. ఆయన ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్ బీ పట్టా పొందారు. 1990 నుంచి 2000 వరకు ఉత్తర ప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా పని చేశారు. 2001 లో జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012 జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 ఏప్రిల్ నుంచి జార్ఖండ్ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ- ఎగ్జిక్యూటివ్ చైర్మన్ గా 2022 నుంచి 2023 వరకు జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు. 2023 ఏప్రిల్ 17న త్రిపుర హైకోర్టు సీజేగా పదోన్నది పొందగా తాజాగా ఆయనను తెలంగాణ హైకోర్టుకు సీజేగా నియమిస్తూ కొలీజియం సిఫార్సు చేసింది. ఈ సిఫార్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు.

## సంపాదకీయం

# మాయమవుతున్న మానవ విలువలు !

మాయమవుతున్నదమ్మా..మనిషన్న వాడు అన్న చందంగా మన సమాజాం తయారయ్యింది. హత్యలు, హత్యాచారాలు,అకృత్యాలు నిత్యకృత్యం అయ్యాయి. అమ్మాయిలు కనిపిస్తే అయాచారం చేసి చంపేస్తున్నారు. కాలేజీలకు వెళ్లాలంటేనే భయంకర పరిస్థితులు ఉన్నాయి. తోటి విద్యార్థి లేదా పాఠాలు చెప్పే టీచర్లు ఎవరు కాటేస్తారో తెలియని పరిస్థితి ఉంది. అత్యాచారంతో పాటు ఏకంగా హత్యలు చేసేస్తు న్నారు. ప్రతిఘటించినా కిరాతకంగా చంపేస్తున్నారు. మృగాళ్ల రాక్షసప్రవృత్తి మితిమీరి పోతోంది. భర్తలను చంపే భార్య..భార్యలను చంపే భర్తలు..ప్రేమ పేరుతో చంపే కుర్రాళ్లు..ఒంటరిగా వెళ్ళిన అమ్మాయిని కాపుకాసి ఎత్తుకెళ్లు హత్యాచారం చేయడం వంటివన్నీ నిత్యం చూస్తున్నాం. ఉపాధ్యాయ విద్యార్థిని పట్ల ఓ అధ్యాపకుడే వేధింపులకు పాల్పడితే..; కళాశాలకు వెళ్లిన విద్యార్థిని విగతజీవిగా తుప్పల్లో పడి ఉంటే ... మహిళలకు ఇంకేం భద్రత ఉన్నట్లు... భర్తలను వదించుకునే భార్యల క్రమసంఖ్య పెరుగు తోంది. ప్రియుడి మోజుల చంపేవారు కొందరు....ప్రియురాలి కోసం భార్యలను వదిలించుకునే వారు మరికొందరు... ఆస్తుల పంచాయితీల్లో అన్నాతమ్ముల మనే భావన పోతోంది. అన్నను తమ్ముడు చంపడమో..తమ్ముడిని అన్నను చంపడమో మామూలు విషయం అయ్యింది. మద్యానికి బానిసలై తల్లిదండ్రులను కడతేరుస్తున్నారు. తల్లులను, తండ్రులను కడతేర్చడానికి వెనకాడడం లేదు. ఇలా దేశంలో ఎక్కడ చూసినా రోజుకు డజన్ల కొద్దీ సంఘటనలు వినాల్సి వస్తోంది. పోలీసులు అన్నా..జైలు అన్నా భయం లేకుండా పోతోంది. కొన్ని రోజులు జైలుకు వెళ్లి వద్దాంలే అన్న ధోరణి కనిపిస్తోంది. జైలుకు వెళతామన్న జ్ఞానం లేకుండా కడతేరు స్తున్నారు. ఇక అత్యార ఘటనలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఇటీవల హైదరాబాద్‌లో ఓ కూతరు ప్రియుడితో కలసి తల్లిని హత్య చేయించింది. వరంగల్‌లో ప్రియురాలు మోజులో పడి భార్యను నిర్లక్ష్యం చేయడంతో ఇటీవల ఓ డెంటిస్ట్ ఆత్మహత్యయ చేసుకుంది. ఇలా ఒకటనికాదు..వందలకొద్దీ అనేక ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. సమాజంలో పడిపోతున్న విలువలు, పెరుగుతున్న విష సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. కోల్‌కతాలో వరుస హత్యాచార ఘటనలు..ఆందోళన కలిగించాయి. కోల్‌కత్తా లాకాలేజీ విద్యార్థినిపై సహ విద్యార్థుల అత్యాచారం,ఐఐఎం విద్యార్థినిపై కళాశాల హాస్టల్లోనే అఘాయిత్యం జరిగాయి. బెంగాల్‌లో అధికార పార్టీకి చెందిన విద్యార్థి సంఘం నాయకులు ఈ దుర్మార్గం వెనుక ఉన్నారని వార్తలు వచ్చాయి. గతేడాది ఆగస్టు 9వ తేదీన కోల్‌కతాలోని ఆర్‌జి కర్ హాస్పటల్లో జూనియర్ డాక్టర్ అత్యాచారానికి, హత్యకు గురి కావడం దేశవ్యాప్త ఆందోళనలకు దారి తీసింది. జాతీయ నేర నివారణ విభాగం గణాంకాల ప్రకారం.. దేశంలో రోజుకు 86 అత్యాచారాలు నమోదవుతున్నాయి. ఇందులో 90 శాతం దారుణాలు తెలిసిన వ్యక్తుల ద్వారానే జరుగు తుండడం గమనార్హం. బాధితుల్లో 10 శాతం మంది 18ఏళ్ల లోపు వారు కాగా, 66శాతం మంది 18-30 ఏళ్ల లోపువారు. దేశంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న హత్యాచార ఘటనలు ఆందోళన కలిగిస్తున్నారు. దేశంలో,రాష్ట్రంలో విద్యార్థినులపై జరుగుతున్న దారుణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సామాజికంగా, శాంతిభద్రతల పరంగా మన వెనుక బాటుతనాన్ని, పాలకుల నిర్లక్ష్య, నిర్లిప్త ధోరణులను ఎత్తి చూపుతు న్నాయి. చదువుకునే చోట విద్యార్థినులకు తగిన భద్రత కరువైన సంఘటనలు ఇటీవల అనేకం వెలుగు చూశాయి. విద్యా నైపుణ్యాలను అందించి, వికాసానికి తోడ్పాడాల్సిన విద్యాలయ ప్రాంగణాలు కూడా అమ్మాయిల పట్ల అభద్రతా వలయాలుగా మారటం విచారకరం. ఒడిషాలో బిఇడి విద్యార్థిని ... తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అధ్యాపకుడి మీద ఫిర్యాదు చేసినా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణం. బాధితురాలి ఆవేదనపై సంబంధిత అధికారులు, పోలీసులు తగు విధంగా స్పందించనప్పుడు - అది వేధించేవాడికి మరింత బలమవుతుంది. ధైర్యాన్ని కూడగట్టుకొని ఫిర్యాదు చేసిన బాధితురాలి ఆత్మస్థయిరాన్ని దెబ్బ తీస్తుంది.ఈ దుస్థితే భవిష్యత్తు లో ఉపాధ్యాయినిగా ఎదగాల్సిన విద్యార్థిని బలన్మరణానికి దారి తీసింది. ఫిర్యాదు చేసినప్పుడు స్పందించని కళాశాల యాజమాన్యంపైనా, అధికారుల పైనా ఒడిశాలో పెద్దఎత్తున నిరసన వ్యక్తమవు తోంది. విద్యార్థి సంఘాలు గురువారం రాష్ట్ర బంద్ పాటించాయి. కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన ఇంటర్ విద్యార్థిని కళాశాలకు వెళ్లి, గండికోటలో అనుమానాస్పద స్థితిలో విగతజీవిగా కనిపించింది. ఏం జరిగిందో పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది. కొద్ది రోజుల క్రితం కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పారా మెడికల్ విద్యార్థినులు... తమను ల్యాబ్ అసిస్టెంటు, మరో ముగ్గురు సిబ్బంది లైంగిక వేధింపులకు గురి చేస్తున్నట్టు- ఫిర్యాదు చేశారు. ఏలూరులోని స్పోర్ట్స్ అథారిటీ- ఆఫ్ ఇండియా కేంద్రంలో క్రీడాకారిణుల పట్ల కోచ్‌లు లైంగిక వేధింపులకు పాల్పడినట్టు- గత నెలలో వచ్చిన వార్తలు సంచలనం కలిగించాయి. చదువుకున్న చోట, శిక్షణ పొందుతున్న చోట విద్యార్థినులకు రక్షణ లేకపోవటం అత్యంత విచారకరం. తమ మాట వినకుంటే భవిష్యత్తుకు నష్టం కలిగి స్తామన్న బెదిరింపులతో కొంతమంది శిక్షకులు, అధ్యాపకులు, సిబ్బంది వికృత చేష్టలకు పాల్పడడం నిత్య కృత్యంగా మారుతోంది. ఇలాంటి వాటిపై కొద్దిపాటి సమాచారం తమ దృష్టికి వచ్చినా యాజమాన్యాలూ, అధికారులూ తక్షణ చర్యలు తీసుకోవాలి. ఏ పేరుతో ఆలస్యం చేసినా అది దుర్మార్గుల దుశ్చేష్టలకు ఊతమిచ్చినట్టే అవుతుంది. అలాగే, నేర నిరూపణ చేయటంలోనూ పోలీసు యంత్రాంగం తరచూ విఫలమ వుతోంది. సంచలనం కలిగించిన ఆయేషా, రిషితేశ్వరి ఉదంతాలు రెంటిలోనూ నిందితులకు శిక్ష పడలేదు. దర్యాప్తులో చోటు- చేసుకునే వైఫల్యాలు కూడా నేర ప్రవర్తకులకు పరోక్ష ధైర్యాన్నిస్తాయి. ఈ విష సంస్కృతికి అడ్డుకట్ట వేయాలంటే కఠిన శిక్షలు విధాల్సిందే. మరణశిక్షలకు సైతం వెనకాడరాదు. అలాగే చిన్నిప్పటి నుంచే విలువలతో కూడా పాఠ్యాం శాలు బోధించాలి. మన కుటంబ వ్యవస్థ గురించి బోధనలు జరగాలి. హితోపదేశాలకు సంబంధించిన పాఠాలు చెప్పాలి. మొక్కై వంగనిది మానై వంగునా అన్నట్లుగా మన పాఠ్యాంశాలను మార్చుకోవాల్సి ఉంది. ఉరుకులు పరుగుల జీవితంలో పిల్లల నడవడిని తల్లదండ్రులు పట్టించుకోవడం లేదు. మళ్లీ మన విద్యావిధానం, విలువలు, సంస్కృతి తదితర అంశాలనో బోధనగా చేర్చి మార్పునకు కృషిచేయాల్సి ఉంది. సమజాంలో టీచర్లు ముందుగా మారాలి. రాజకీయ నాయకులు, మేధావులు ఉత్తమ విద్యావిధానం కోసం పాటుపడాలి. అప్పుడే కొంతయినా మార్పు రాగలదు.

# తెలంగాణ హైకోర్టు కొత్త ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణ స్వీకారం

రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
సీఎం రేవంత్ తదితరుల హాజరు

**హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ**
తెలంగాణ హైకోర్టు కొత్త ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్ భవన్ లో మధ్యాహ్నం 12:30 గంటలకు జస్టిస్ ఏకే సింగ్ తో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారు, డీజీపీ, హైకోర్టు న్యాయమూర్తులు, తెలంగాణ మంత్రులు తదితరులు హాజరయ్యారు. కాగా తెలంగాణ హైకోర్టు ఏర్పాటైన తర్వాత జస్టిస్ ఏకే సింగ్ ఏడవ చీఫ్ జస్టిస్ గా నియమితులయ్యారు. త్రిపుర హైకోర్టు సీజేగా పనిచేస్తున్న ఆయన బదిలీపై తెలంగాణకు వచ్చారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన జస్టిస్ సుజయ్ పాల్ కోల్ కతా హైకోర్టుకు బదిలీ అయ్యారు.





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ 1965 జులై 7న జన్మించారు. ఆయన ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్ బీ పట్టా పొందారు. 1990 నుంచి 2000 వరకు ఉత్తర ప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా పని చేశారు. 2001 లో జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012 జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 ఏప్రిల్ నుంచి జార్ఖండ్ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ- ఎగ్జిక్యూటివ్ చైర్మన్ గా 2022 నుంచి 2023 వరకు జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు. 2023 ఏప్రిల్ 17న త్రిపుర హైకోర్టు సీజేగా పదోన్నది పొందగా తాజాగా ఆయనను తెలంగాణ హైకోర్టుకు సీజేగా నియమిస్తూ కొలీజియం సిఫార్సు చేసింది. ఈ సిఫార్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు.

# మండల సమగ్ర అభివృద్ధికై పోరాడుదాం


## గోద శ్రీరాములు

**ప్రజా స్వేచ్ఛ -వలిగొండ**
వలిగొండ మండలం కౌన్సిల్ సమావేశం వర్కింగ్ జర్నలిస్టు ప్రెస్ క్లబ్ కార్యాలయంలో సల్వాద్రి రవీంద్ర అధ్యక్షతన జరిగినది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు పాల్గొని మాట్లాడుతూ వలిగొండ మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మూసి ప్రక్షాళన, పిలాయిపల్లి కాలువ ఇరిగేషన్ సంబంధించిన కాలువలు చెక్ డ్యాం లు రైతులకు ఉపయోగపడేటువంటి నీరును అందించాలని సాగునీరు కోసం ఈ మండలంలో ఉన్న వేలాది ఎకరాల భూములకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా 4 వ మహాసభలు వలిగొండలో జరపాలని నిర్ణయించారు ఈ మహాసభ కు ప్రతినిధులు,బహిరంగ సభ ఏర్పాటు ముమ్మరంగా సాగించాలని తక్కువ సమయంలో ఎక్కువ పని చేయాలని కార్యకర్తలను కోరారు ఈ మహాసభ యాదాద్రి భువనగిరి జిల్లా అన్ని మండలాలలో ప్రజలు,నిరుపేదలు రైతులు,వ్యవసాయ కూలీలు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చర్చించబడతాయని భవిష్యత్తులో యాదాద్రి జిల్లా అన్ని రంగాలలో కమ్యూనిస్టు పార్టీ , ప్రజాసంఘాల నిర్మాణం చేస్తూ ప్రజల్ని చైతన్యం చేసి ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని ఉధృతమైన కార్యక్రమాలు తీసుకోవటానికి ఈ మహాసభలో చర్చలు జరుగుతాయి .జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంలో సర్పంచులు ,ఎంపీటీసీలు ,జడ్పిటిసిలు బలమున్న ప్రాంతాలలో సిపిఐ పోటీ చేస్తున్నదని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శిలు యానాల దామోదర్ రెడ్డి,బోలగోని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, కొల్లూరు రాజయ్య, ఎండి ఇమ్రాన్, సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, మండల కౌన్సిల్ సభ్యులు పోలెపాక యాదయ్య,బాలగోని సత్యనారాయణ, అంబటి అంజయ్య, పులిపలుపుల మల్లేశం, కట్ల యాదగిరి, కోయగుర రామ్మల్లు, సుద్దాల సాయికుమార్,యాస జనార్దన్ రెడ్డి, బత్తుల బిక్షపతి, సలగంజి కృష్ణ కుమార్,చొప్పరి వెంకటేశం,తదితరులు పాల్గొన్నారు



# కులగణనపై ప్రభుత్వానికి 300 పేజీల నివేదిక

-సమర్పించిన స్వతంత్ర నిపుణుల కమిటీ
-సీఎం రేవంత్‌తో కమిటీ చైర్మెన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి బృందం భేటీ



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ**
రాష్ట్రంలో చేపట్టిన కులగణనను అధ్యయనం చేయడానికి ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ తన 300 పేజీల నివేదికను సమర్పించింది. శనివారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎమ్‌సీఆర్ హెచ్‌ఆర్‌డీ)లో కమిటీ చైర్మెన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి, సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు పలువురు మంత్రులు, నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలో కుల గణన అనేది శాస్త్రీయంగా, నిర్దిష్టంగా, వాస్తవాల ఆధారంగా జరిగిందని ఈ సందర్భంగా కమిటీ అభిప్రాయపడింది. ఇది చారిత్రాత్మకమని, దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని పేర్కొంది. అనంతరం సీఎం రేవంత్ మాట్లాడుతూ%%కుల గణన అనేది కేవలం ఒక డేటా కాదనీ, అది తెలంగాణకు మెగా



హెల్త్ చెకప్ లాంటిదని వ్యాఖ్యానించారు. తమ నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో ఈ సర్వేను చేపట్టామని తెలిపారు. బలహీనవర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయాన్ని అమలు చేసేందుకు నివేదిక ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలు, అందుకుగల కారణాలపై అధ్యయనం చేయాలంటూ నిపుణుల కమిటీని ఆయన కోరారు. ప్రజల అవసరాలను గుర్తించి, సరైన సూచనలు, సలహాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వాటి ఆధారంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికలోని అంశాలను, సూచనలను మంత్రివర్గంలో చర్చించిన అనంతరం ప్రభుత్వం తన తదుపరి కార్యాచరణను ప్రకటించనుంది.

# బోనాల సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు..

## 20, 21వ తేదీల్లో అమల్లోకి..



**హైదరాబాద్ సిటీ**-ప్రజా స్వేచ్ఛ

బోనాల వేడుకల సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఆయా ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20, 21వ తేదీల్లో ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు.

**లాల్ దర్వాజా ఆలయం పరిసరాల్లో..**

సింహవాహిని మహంకాళి లాల్ దర్వాజా ఆలయంలో ఈనెల 21న నిర్వహించే బోనాల సందర్భంగా ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఆలయ పరిసరాల్లో సాధారణ వాహనాలకు అనుమతి ఉండదు. ఇంజన్‌బౌలి, ఫలక్‌నుమా వైపు నుంచి ఆలియాబాద్ వైపుకు వచ్చే వాహనాలను న్యూ షంషేర్‌గంజ్ నుంచి గోశాల, మిస్రీగంజ్ వైపునకు మళ్లీస్తారు. మహబూబ్‌నగర్ క్రాస్‌రోడ్ నుంచి ఆలియాబాద్ వైపునకు వచ్చే వాహనాలను ఇంజన్‌బౌలి నుంచి జమనుమా, గోశాల వైపునుకు డైవర్ట్ చేస్తారు. నాగులచింత, సుధాటాకీస్ వైపు నుంచి లాల్‌దర్వాజా వైపునకు వచ్చే వాహనాలను గౌలిపురా వైపునకు పంపుతారు. చార్మినార్ వైపు నుంచి నల్లచింత వైపుకు వచ్చే వాహనాలను హరిబౌలి, ఓల్గా హెూటల్ వైపునకు మళ్లిస్తారు. ఇంకా పలు రూట్లలో ట్రాఫిక్ డైవర్ట్ చేస్తున్నామని” అని తెలిపారు.

**పార్కింగ్ ప్రాంతాలు:**

ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలను నిలిపేందుకు షాలిబండ ప్రధాన రోడ్‌పై, ఆర్యవైశ్యమందిర్, వీడీపీ స్కూల్ గ్రౌండ్, మిత్రా స్పోర్ట్స్ క్లబ్, చార్మినార్ బస్‌టర్మినల్, ఢిల్లీగేట్ వద్ద పార్కింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. అంబర్‌పేట్ మహంకాళి ఆలయ పరిసరాల్లో....ఉప్పల్ నుంచి చాదర్‌ఘాట్, ఎంజీబీఎస్ వైపుకు వెళ్లే భారీ వాహనాలు, సిటీ బస్సులు, ఆర్టీసీ బస్సులను అంబర్‌పేట్ ఫ్లైఓవర్ పైనుంచి పంపుతారు.

**చిలకలగూడ కట్టమైసమ్మ పోచమ్మ టెంపుల్ పరిసరాల్లో..**

చిలకలగూడ కట్టమైసమ్మ పోచమ్మ ఆలయ పరిసరాల్లో ఆదివారం, సోమవారం రోజుల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు సాధారణ వాహనాలకు అనుమతి లేదు..



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

### ప్రధాని మోడీ,యం పి రఘునందన్ రావు కి మెదక్ జిల్లా కేంద్రం రాందాస్ చౌరస్తా వద్ద పాలాభిశేఖం.



**మెదక్ జిల్లా** -ప్రజా స్వేచ్ఛ

శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ రాధ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, రఘునందన్ రావు ల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ రాధ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ దుండిగల్ రింగ్ రోడ్డు నుంచి నర్సాపూర్ మీదుగా మెదక్ వరకు నాలుగు లైన్ల హైవే రోడ్డు, మెదక్ పట్టణానికి రింగు రోడ్డు మంజూరైన సందర్భంగా పాలాభిషేకం చేసినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే చేయడం జరుగుతుందని అన్నారు.ఈ రోడ్ల మంజూరు కు కృషి చేసిన ఎంపీ రఘునందన్ రావుకు మెదక్ జిల్లా ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్, ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, మండల అధ్యక్షురాలు బెండ వీణ, నాయకులు శివ, విఠలేష్, రాము, రంజిత్ రెడ్డి,ఏసురెడ్డి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


## ఆర్.ఆర్ స్కూల్ లో ఘనంగా బోనాల పండుగ



**కామారెడ్డి జిల్లా**
ప్రజా స్వేచ్ఛ

పాల్వంచ మండల కేంద్రంలోని ఆర్.ఆర్ పాఠశాలలో శనివారం రోజున బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆర్.ఆర్ పాఠశాలలో ( ఆర్ ఆర్ స్కూల్ ) శనివారం బోనాల పండుగను (బోనాలు ఫెస్టివల్ ) ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ టి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ రాష్ట్రంలో ఆషాడ మాసంలో జరుపుకునే ముఖ్యమైన పండుగ అన్నారు. ఈ పండుగను హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో , రాష్ట్రంలోని ప్రాంతాలలో పండుగను ఘనంగా జరుపుకుంటారన్నారు. బోనాల పండుగ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు స్కూల్లోనే తయారుచేసిన నైవేద్యాన్ని తలపై పెట్టుకుని ఊరేగింపుగా దేవాలయాలకు వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. విద్యార్థులు పోతురాజుల విన్యాసాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సాంప్రదాయ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రామ్ రెడ్డి సునీల్ రెడ్డి,రామచంద్రం, రాణి మానస,మౌనిక, విజయరాణి, రేఖ విద్యార్థి,విద్యార్థులు పాల్గొన్నారు.


# సమాచార హక్కు చట్టం సామాన్యుడి వజ్రాయుధం



SAMACHARA HAKKU CHATTAM SADHANA COMMITTEE
Recognised by Niti Aayog, New Delhi, Government Of India.
Unique ID : TS/2025/0585660
Recognised by Ministry Of Social Justice & Empowerment
NGO ID : TG/00043492
Registered No. 1094/24, (Under Trust Act 1882)

| | |
|---|---|
| Name | : Gandu Narsimha |
| Designation | : Executive Member |
| Working Area | : Ranga Reddy District |
| ID No. | : SHCSC-TS-RR-13 |
| Mobile | : +91 9177883929 |
| Valid Upto | : 31-12-2025 |

Issuing Authority
National Chairman
Dr. Chanti Mudhiraj



SAMACHARA HAKKU CHATTAM SADHANA COMMITTEE
Recognised by Niti Aayog, New Delhi, Government Of India.
Unique ID : TS/2025/0585660
Recognised by Ministry Of Social Justice & Empowerment
NGO ID : TG/00043492
Registered No. 1094/24, (Under Trust Act 1882)

| | |
|---|---|
| Name | : Guddeti Praveen |
| Designation | : Secretary |
| Working Area | : Ranga Reddy District |
| ID No. | : SHCSC-TS-RR-10 |
| Mobile | : +91 9848318945 |
| Valid Upto | : 31-12-2025 |

Issuing Authority
National Chairman
Dr. Chanti Mudhiraj

**– గుడ్డేటి ప్రవీణ్, గండు నరసింహ**

**హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ**

సమాచార హక్కు చట్ట సాధన కమిటీలో సభ్యులుగా చేరిన గుడ్డేటి ప్రవీణ్ మరియు గండు నరసింహ, సమాచార హక్కు చట్టం సామాన్య ప్రజలకు ఒక వజ్రాయుధం లాంటిదని స్పష్టం చేశారు. ఈ చట్టం ద్వారా ప్రజలు ప్రభుత్వ పాలనలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని డిమాండ్ చేయవచ్చని, తద్వారా అవినీతిని అరికట్టడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడానికి తమకు ఈ గొప్ప అవకాశాన్ని కల్పించిన చంటి ముదిరాజ్ (టైగర్ చంటన్న) గారికి గుడ్డేటి ప్రవీణ్ మరియు గండు నరసింహ ఈ సందర్భంగా తమ ప్రగాఢ కృతజ్ఞతలు తెలియజేశారు. “సామాన్య ప్రజలకు ఈ చట్టం యొక్క శక్తిని వివరించి, దానిని ఎలా ఉపయోగించుకోవాలో తెలియజేయడానికి మాకు దక్కిన ఈ అవకాశం చాలా విలువైంది. చంటన్న గారి సహకారం లేకుండా ఇది సాధ్యమయ్యేది కాదు” అని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే జాప్యాన్ని, వివక్షను, అవినీతిని అరికట్టడంలో సమాచార హక్కు చట్టం సమర్థవంతంగా పనిచేస్తుందని వారు ఉద్ఘాటించారు. ఒక సాధారణ పౌరుడు కూడా ప్రభుత్వ శాఖల నుండి తమకు అవసరమైన సమాచారాన్ని పొందేందుకు ఈ చట్టం పూర్తి హక్కును కల్పిస్తుందని వారు గుర్తు చేశారు.సమాచార హక్కు చట్టం కేవలం సమాచారం పొందడానికి మాత్రమే కాకుండా, ప్రభుత్వ పథకాలు, నిధుల వినియోగం, అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకోవడానికి కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని వారు వివరించారు. దీనివల్ల ప్రజలు తమ హక్కుల పట్ల మరింత అవగాహన పెంచుకొని, ప్రభుత్వ పాలనలో చురుగ్గా పాలుపంచుకోవడానికి వీలవుతుందని అన్నారు. సమాచార హక్కు చట్ట సాధన కమిటీలో చేరిన తర్వాత, ఈ చట్టాన్ని మరింత మంది సామాన్య ప్రజల వద్దకు తీసుకెళ్లడానికి తాము కృషి చేస్తామని గుడ్డేటి ప్రవీణ్ మరియు గండు నరసింహ హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో, అట్టడుగు వర్గాల ప్రజల్లో ఈ చట్టంపై అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలను చేపడతామని వారు ప్రకటించారు. సమాచార హక్కు చట్టాన్ని కేవలం ఒక కాగితంపై ఉన్న చట్టంగా కాకుండా, ప్రతి పౌరుడికి అందుబాటులో ఉండే ఒక శక్తివంతమైన సాధనంగా మార్చడమే తమ లక్ష్యమని వారు పునరుద్ఘాటించారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వంలో జవాబుదారీతనం మరింత పెరుగుతుందని, పారదర్శకమైన పాలన దిశగా ఇది ఒక ముందడుగు అవుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# వంశీచంద్ రెడ్డిని ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



హైదరాబాద్, - ప్రజా స్వేచ్ఛ

జిల్లా అధ్యక్షుల ఎంపిక ప్రక్రియకు ఇన్‌చార్జ్‌గా నియమితులైన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో పార్టీ బలపడుతుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి చేర్చాలనే సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, అమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత, డీసీసీ ఉపాధ్యక్షులు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా పాల్గొన్నారు.

# దామరచర్లలో ప్రజా సమస్యలపై సిపిఐ వినతి



దామరచర్ల, - ప్రజా స్వేచ్ఛ

గ్రామాలలో కోతులు, వీధి కుక్కల బెడద నుండి ప్రజలను రక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని దామరచర్ల సిపిఐ పార్టీ నాయకులు ఎంపీడీఓకి వినతి పత్రం అందజేశారు. మిషన్ భగీరథ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎల్లవేళలా వైద్యుల సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామపంచాయతీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరాన్ని కూడా వారు హితవుగా సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ దామరచర్ల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్, సహాయ కార్యదర్శి ధనావత్ శాంతి, గౌరవ నాయకులు గజ్జల లక్ష్మీ నరసింహా రెడ్డి, సీనియర్ నాయకులు జమ్ముల కోటయ్య, సుద్ధబోయిన రాములు, రవి నాయక్, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ప్రోత్సాహం.. క్రీడలతో దృఢత్వం



దేవరకొండ,- ప్రజా స్వేచ్ఛ

యువత అన్ని రంగాల్లో రాణించాలని బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు రమావత్ హిమావంత్ కుమార్ ఆకాంక్షించారు. గుమ్మడవెల్లి గ్రామంలో తన పుట్టినరోజు సందర్భంగా జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రీడలతో శరీర దృఢత్వం పెరుగుతుందని, యువతకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బొడ్డుపల్లి కృష్ణ, రమావత్ తులసిరామ్, రమేష్, వాజిద్ పాషా, గుండెబోయిన లింగం యాదవ్, పంగ లాలయ్య, జంగీర్, రాపర్తి శ్రీను, యాదగిరి, పంగ రామయ్య, బొడ్డుపల్లి యాదయ్య, పంది హరికృష్ణ, కావటి వెంకటేష్, కొర్ర బీమా, అఫ్రోజ్, పంగ మల్లేష్, చింటూ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# వేధింపుల నివారణకు షీ టీం చైతన్య కార్యక్రమాలు

నాగర్ కర్నూలు,

ప్రజా స్వేచ్ఛ




నాగర్ కర్నూలు బస్టాండ్‌లో ఎస్ఐ వీణ ఆధ్వర్యంలో షీ టీం, భరోసా కేంద్రం ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఒంటరిగా ఉన్న మహిళలు, విద్యార్థినులు సోషల్ మీడియా ద్వారా మోసపోతున్నారని, వేధింపులకు గురైతే 100 లేదా 8712657676 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ శ్రీలత, షీ టీం మెంబెర్ వెంకటయ్య, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు శర్మ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం

-నియోజకవర్గ అభివృద్దే నా ఎజెండాలి
-ఆహార భద్రత కొత్త రేషన్ కార్డుల ను పంపిణీ చేసిన శాసనసభ్యులు, మైనంపల్లి రోహిత్ రావు.



మెదక్ జిల్లా-ప్రజా స్వేచ్ఛ

చరిత్రలో నిలిచిపోయే విధంగా సంక్షేమ పథకాలు కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే అమలు అవుతున్నాయని మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. హవేలీఘన్పూర్ మండలంలో రైతు వేదికలో ఆహార భద్రత కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి లిస్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఈ సందర్భంగా శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావ్ మాట్లాడుతూ... ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు పెట్టుకున్న ఆశలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం నడుస్తుందన్నారు గత పది సంవత్సరాలుగా ఎంతోమంది నిరుపేదలు రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారని...వారికిరేషన్ కార్డులను పంపిణి చేసి మనస్ఫూర్యాన్ని అందించాలని ఈ నెల 14 న రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి కొత్త రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు ఈరోజు ఒక పండుగ వాతావరణం నెలకొందని....గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డు ల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ లబ్ధిదారులు తిరుగుతూ ఇబ్బందులు పడే వారని...ప్రభుత్వం ఏర్పడగానే.. ప్రజాపాలన లో, మీ సేవ లో అలాగే నేరుగా అధికారులకు రేషన్ కార్డు మంజూరు కోసం వచ్చిన దరఖాస్తుల విచారణ అనంతరం అర్హులైన వారికి పంపిణి చేస్తున్నామన్నారు పేదల కోసం వినూత్న సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి.. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందన్నారు పేద వాళ్ళు కూడా కడుపు నిండా అన్నం తినాలని ఆహార భద్రత కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణి చేస్తున్నామన్నారు.. ఇది చరిత్ర లో మిగిలిపోయే నిర్ణయమన్నారు ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# మండల సమగ్ర అభివృద్ధికై పోరాడుదాం

## గోద శ్రీరాములు



వలిగొండ - ప్రజా స్వేచ్ఛ

వలిగొండ మండలం కౌన్సిల్ సమావేశం వర్కింగ్ జర్నలిస్టు ప్రెస్ క్లబ్ కార్యాలయంలో సల్వాద్రి రవీంద్ర అధ్యక్షతన జరిగినది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు పాల్గొని మాట్లాడుతూ వలిగొండ మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మూసి ప్రక్షాళన, పిలాయిపల్లి కాలువ ఇరిగేషన్ సంబంధించిన కాలువలు చెక్ డ్యాం లు రైతులకు ఉపయోగపడేటువంటి నీరును అందించాలని సాగునీరు కోసం ఈ మండలంలో ఉన్న వేలాది ఎకరాల భూములకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా 4 వ మహాసభలు వలిగొండలో జరపాలని నిర్ణయించారు ఈ మహాసభ కు ప్రతినిధులు,బహిరంగ సభ ఏర్పాటు ముమ్మరంగా సాగించాలని తక్కువ సమయంలో ఎక్కువ పని చేయాలని కార్యకర్తలను కోరారు ఈ మహాసభ యాదాద్రి భువనగిరి జిల్లా అన్ని మండలాలలో ప్రజలు,నిరుపేదలు రైతులు,వ్యవసాయ కూలీలు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చర్చించబడతాయని భవిష్యత్తులో యాదాద్రి జిల్లా అన్ని రంగాలలో కమ్యూనిస్టు పార్టీ , ప్రజాసంఘాల నిర్మాణం చేస్తూ ప్రజల్ని చైతన్యం చేసి ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని ఉధృతమైన కార్యక్రమాలు తీసుకోవటానికి ఈ మహాసభలో చర్చలు జరుగుతాయి .జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంలో సర్పంచులు ,ఎంపీటీసీలు ,జడ్పిటిసిలు బలమున్న ప్రాంతాలలో సిపిఐ పోటీ చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్ రెడ్డి,బోలగోని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, కొల్లూరు రాజయ్య, ఎండి ఇమ్రాన్, సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, మండల కౌన్సిల్ సభ్యులు పోలెపాక యాదయ్య,బాలగోని సత్యనారాయణ, అంబటి అంజయ్య, పులిపలుపుల మల్లేశం, కట్ల యాదగిరి, కోయగుర రామ్మల్లు, సుద్దాల సాయికుమార్,యాస జనార్దన్ రెడ్డి, బత్తుల బిక్షపతి, సలగంజి కృష్ణ కుమార్,చొప్పరి వెంకటేశం,తదితరులు పాల్గొన్నారు

# మక్త మహబూబ్ పేట్ లో నీటి కొరత లేకుండా చూడండి

## గ్రామస్తుల డిమాండ్



శేరి లింగంపల్లి- ప్రజా స్వేచ్ఛ

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో గల మియాపూర్ డివిజన్ పరిధిలోనీ మక్త మహబూబ్ పేట్ గ్రామంలో గత కొన్ని నెలలుగా కొందరు అక్రమంగా బోర్లు వేసి వాటర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసి నీటి వ్యాపారం చేయడం వాళ్ళ గ్రామంలోని ఇండ్లలో ఉన్న బోర్లు ఎండిపోయాయని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయం పై పలుమార్లు అధికారులకు పిర్యాదు చేసినప్పటికి కొన్ని రోజులు ఆపినట్లే అపి మళ్ళీ మొదలు పెడుతున్నారనీ రెవిన్యూ అధికారులకు పిర్యాదు చేశారు. ధీంతో శనివారం రోజు ఆర్ ఐ శ్రీనివాస్, కావాలి కారు అంజనేయులు లు మక్త గ్రామం లోని వాటర్ ప్లాంట్ లను సీజ్ చేశారు. ఈ సందర్బంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామం లో కొందరి వల్ల అందరూ ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాలు అధికారులకు పిర్యాదు చేస్తే చర్యలు తీసుకోకపోవడం తో ఉన్నతాదికారులకు పిర్యాదు చేస్తామని చెప్పడం తో రెవిన్యూ అధికారులు వచ్చి అక్రమ నీటి ప్లాంట్ లను సీజ్ చేశారు. మరోసారి ఇలాంటి వాటిని ప్రోత్సహించకూడదని డిమాండ్ చేశారు. గ్రామస్తుల వినతినీ పరిశీలించి నీటి కొరత లేకుండా చూడాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో : దర్గా ప్రభాకర్ ముదిరాజ్, కొంచె ప్రభాకర్, గుండె గణేష్ ముదిరాజ్, గుండె దయానంద్, సారా రమేష్, గంగారం నర్సింగ్ రావు, దర్గా శేఖర్, రాజెరావు శ్రీను, రాము, గ్రామస్తులు, గుండె రాజు, కాసాని రాములు, శివరాజ్జాజెరావు సంతోష్,: నరేష్, గుండె శంకరయ్య,తదితరులు పాల్గొన్నారు

# భక్తులు శాంతియుత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకోవాలి.

-గాంధారి మైసమ్మ నేటి జాతరలో బారి బందోబస్తు.
-పోలీస్ సిబ్బందికి సూచనలు,భక్తులు పోలీస్ వారికి సహకరించాలి
-బెల్లంపల్లి ఏసిపి రవికుమార్,మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి.



మంచిర్యాల జిల్లా.-ప్రజా స్వేచ్ఛ

రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆదేశాలమేరకు రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొక్కలగుట్ట శ్రీశ్రీశ్రీ గాంధారి మైసమ్మ ప్రాంగణంలో నేడు నిర్వహించే మైసమ్మ జాతర సందర్భంగా బారి బందోబస్తు సందర్భంగా విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న బెల్లంపల్లి ఏసిపి రవికుమార్,సిఐ శశిధర్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేడు జరిగే మైసమ్మ జాతరకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు,ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కలు చెల్లించుకుంటారని,జాతర జాతీయ ప్రధాన రహదారి పక్కనే అవడం వలన రద్దీ ఎక్కువై ట్రాఫిక్ కి అంతరాయాలు ఏర్పడకుండా, భక్తులు క్యూ పద్ధతిలో వెళ్లి దర్శనం చేసుకునే విధంగా,ద్విచక్రవాహనాలు,కార్లు పోలీస్ వారు సూచించిన ప్రత్యేక పార్కింగ్ లో మాత్రమే పార్కింగ్ చేసే విధంగా,వాహన పూజ అనంతరం పార్కింగ్ కేటాయించిన ఏరియాలో మాత్రమే వాహనాలను నిలుపేవిదంగా చూడాలని తగు సూచనలు ఇచ్చారు. జాతరకు వచ్చే భక్తులు పోలీస్ వారికి సహకరించాలని,మాయం సేవించి వాహనాలు నడుపరాదని,ట్రాఫిక్ కి అంతరాయాలు ఏర్పడకుండా భక్తులు శాంతియుత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకుని,మొక్కలు చెల్లించుకోవాలని,జాతర ముగిసిన తర్వాత భక్తులు,ప్రజలు సురక్షితంగా ఇళ్లలోకి చేరుకోవాలని కోరారు. శాంతి భద్రతలకు భంగం కలిగించి,చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ ఆకుల అశోక్, హనూక్,ఆర్కేపి పట్టణ ఎస్సై జి. రాజశేఖర్ తోపాటు బెల్లంపల్లి సబ్ డివిజన్ ఎస్సై లు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బిజినెస్

## భారత్ నుంచి తరలిన 5 బిలియన్ల పెట్టుబడులు

### జూన్‌లో రెట్టింపు



న్యూఢిల్లీ

పెట్టుబడిదారులకు భారత ఆర్థిక వ్యవస్థ ఆకర్షణీయంగా కనబడుతున్నట్లు లేదు. ఈ నేపథ్యంలోనే ఇక్కడి పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్లు విదేశాల్లో పెట్టుబడులకు ఎక్కువగా మొగ్గు చూపిస్తున్నారని తెలుస్తోంది. ఇందుకు భారత్ నుంచి బయటకు వెళ్లిన ఎఫ్‌డిఐల గణంకాలే నిదర్శనం. ప్రస్తుత ఏడాది జూన్‌లో బయటికి తరలిపోయిన ఎఫ్‌డీఐలు 5.03 బిలియన్ డాలర్లకు చేరింది. గతేడాది ఇదే నెలలో ఈ మొత్తం 2.9 బిలియన్ డాలర్లతో పోల్చితే దాదాపు 74 శాతం పెరుగుదల చోటు చేసుకుందని స్వయంగా ఆర్‌బిఐ గణంకాలే స్పష్టం చేస్తున్నాయి. విదేశాలకు తరలిపోయిన వాటిలో ఈక్విటీ పెట్టుబడులు 2.04 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇవి గతేడాది ఇదే నెలలోని 670.7 మిలియన్ డాలర్లతో పోల్చితే మూడు రెట్ల పెరుగుదల చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ కాలంలో విదేశాలకు తరలిపోయిన పెట్టుబడులు 6.64 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో 4.3 బిలియన్ పెట్టుబడులు తరలిపోయాయి.

# లక్ష దాటిన బంగారం ధర!

### కొందరికి గుడ్ న్యూస్, ఇంకొందరికి బ్యాడ్ న్యూస్! ఎలాగంటే..?



బంగారం ధర పెరుగు ఆపాడం లేదు. కొంతకాలంగా విపరీతంగా పెరుగుతున్న పసిడి ధర తాజాగా లక్ష రుపాయాలు దాటేసింది. ప్రస్తుతం 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర గ్రాముకు రూ.10,004గా ఉంది. అలాగే 22 క్యారెట్ల గోల్డ్ గ్రాముకు రూ.9170, ఇక 18 క్యారెట్ల బంగారం గ్రాముకు రూ.7,503గా ఉంది. ఇంత భారీగా ధర పెరుగుతుండటం చూసి కొనుగోలుదారులు భయపడుతున్నారు. ఇంతలా బంగారం ధర పెరుగుతూ పోతుంటే.. పెళ్లిళ్లు, శుభకార్యాలకు బంగారం కొనేది ఎలా అంటూ ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తు కాలంలో మరింత ధర పెరిగే అవకాశం ఉందని కూడా ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.అయితే.. బంగారం ధర ఇంతలా పెరుగుతుంటే కొంతమంది బాధపడుతుండగా, మరికొంతమంది సంతోష పడుతున్నారు. బాధపడుతున్న వారిలో త్వరలో బంగారం కొనాలి అనుకునే వారు ఉన్నారు. ముఖ్యంగా ఆడపిల్ల తల్లిదండ్రులు త్వరలోనే అమ్మాయి పెళ్లి పెట్టుకోవాలి అనుకునేవాళ్లు ఈ ధరల పెరుగుదల చూసి భయపడుతున్నారు. ఇక సంతోష పడేవారిలో పెట్టుబడిదారులు ఉన్నారు. బంగారాన్ని పెట్టుబడి మార్గంగా చూసే వారు, ఇప్పటికే నాన్ ఫిజికల్ గోల్డ్‌లో పెట్టుబడి పెట్టిన వారు ఈ ధరల పెరుగుదలతో సంతోషంగానే ఉన్నారు. అలాగే బంగారాన్ని తాకట్టు పెట్టి లోన్ తీసుకోవాలి అనుకుంటున్న వారు ప్రస్తుత బంగారం ధరతో తమ వద్ద ఉన్న బంగారానికి కాస్త ఎక్కువగానే లోన్ వస్తుందని భావిస్తున్నారు.

# నిరాశపర్చిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

### పెరిగిన మొండి బాకీలు క్యూ1 లాభాల్లో తగ్గుదల




దిగ్గజ ప్రయివేటు రంగ విత్త సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆర్థిక ఫలితాలు నిరాశపర్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 1.31 శాతం తగ్గుదలతో రూ.16,258 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.16,475 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో బ్యాంక్ మొత్తం ఆదాయం 83,701 కోట్లుగా నమోదు కాగా.. గడిచిన క్యూ1లో ఏకంగా రూ.99,200 కోట్ల ఆదాయాన్ని సాధించింది. క్రితం క్యూ1లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మొత్తం వ్యయం రూ.63,467 కోట్లకు చేరింది. 2024-25 ఇదే క్యూ1లో రూ.59,817 కోట్ల వ్యయాలు చోటు చేసుకున్నాయి. గడిచిన త్రైమాసికంలో మొండి బాకీల కోసం రూ.14,442 కోట్లు కేటాయించింది. గతేడాది ఇదే త్రైమాసికంలోని రూ.2,602 కోట్ల కేటాయింపులతో పోల్చితే భారీగా పెంచాల్సింది. 2024 జూన్ ముగింపు నాటికి 0.47 శాతంగా ఉన్న స్థూల నిరర్థక ఆస్తులు.. 2025 జూన్ 30 నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.4 శాతానికి పెరిగాయి. స్థూల అడ్వాన్సులు 6.7 శాతం పెరిగి రూ.26.53 లక్షల కోట్లకు, డిపాజిట్లు 16.2 శాతం వృద్ధితో రూ.27.64 లక్షల కోట్లకు చేరాయి.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభాల్లో 16 శాతం వృద్ధి

దేశంలోనే రెండో అతిపెద్ద ప్రయివేటు రంగ విత్త సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్ నికర లాభాలు పెరిగాయి. 2025-26 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 15.5 శాతం వృద్ధితో రూ.12,768 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.11,059 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.19,553 కోట్లుగా ఉన్న నికర వడ్డీ ఆదాయం.. గడిచిన క్యూ1లో 10.6 శాతం పెరిగి రూ.21,635 కోట్లకు చేరింది. ఏడాదికేడాదితో పోల్చితే బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2.15 శాతం నుంచి 1.67 శాతానికి తగ్గాయి.

# టీమిండియాతో సెమీఫైనల్.. నా కెరీర్లో అత్యుత్తమ క్షణం అదే..!



అంతర్జాతీయ క్రికెట్‌లో విధ్వంసక ఆటగాళ్లలో ఒకడైన ఆండ్రీ రస్సెల్ వీడ్కోలుతో అందర్నీ ఆశ్చర్యపరిచాడు. పొట్టి క్రికెట్ స్పెషలిస్ట్‌గా ముద్ర పడిన రస్సెల్ టీ20 వరల్డ్ కప్ టోర్నీకి ఏడు నెలల ముందే అల్విదా పలికి కరీబియన్ జట్టుకు ఝలక్ ఇచ్చాడు. ఆస్ట్రేలియాతో సిరీస్ మధ్యలోనే మూడు ఫార్మాట్ల నుంచి వైదొలగుతున్నట్టు రసెల్ ప్రకటించడంతో అతడి రికార్డులపై ఓ లుక్కేస్తున్నారు అభిమానులు. ఈ కరీబియన్ స్టార్ కూడా ఫ్యాన్స్‌కు తెలియని పలు విషయాలను పంచుకుంటున్నాడు. శనివారం ఈ చిచ్చరపిడుగు తన సుదీర్ఘ జర్నీలోని ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు.పొట్టి ప్రపంచ కప్(2016)లో టీమిండియాపై విజయాన్ని తన కెరీర్లో మర్చిపోలేనని అంటున్నాడీ ఆల్‌రౌండర్. 'అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాక నీ అత్యుత్తమ ఇన్నింగ్స్ ఏది?, నీ కెరీర్లో ఉత్తమ క్షణాలు ఏంటీ? అని చాలామంది అడుగుతున్నారు. నా వరకైతే 2016 పొట్టి వరల్డ్ కప్‌లో టీమిండియాపై ఆడిన ఇన్నింగ్సే అత్యుత్తమం. భారత్‌పై చిరస్మరణీయ విజయమే నా కెరీర్లో అద్భుతమైన క్షణం. 190 పరుగుల ఛేదనకు దిగిన మాకు ప్రేక్షకుల మద్దతు లభించలేదు. అందరూ భారత్‌నే సపోర్ట్ చేస్తున్నారు. దాంతో, కొంచెం ఒత్తిడిగా అనిపించింది. కానీ, ఆ మ్యాచ్‌లో లెండిల్ సిమన్స్(82 నాటౌట్)తో కలిసి మా టీమ్‌ను విజయతీరాలకు చేర్చాను. ఓపెనర్లు, మిడిలార్డర్ కూడా రాణించడం.. నేను, సిమన్స్ చెలరేగడంతో మా జట్టు రెండోసారి పొట్టి కప్‌ను ముద్దాడింది' అని తమ దేశ బోర్డు ఇంటర్వ్యూలో వివరించాడు రస్సెల్.వెస్టిండీస్ జట్టు రెండుసార్లు పొట్టి ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలవడంలో రస్సెల్‌ది కీలక పాత్ర. బ్యాటుతో, బంతితో విశేషంగా రాణించిన అతడు విండీస్ జగజ్జేతగా అవరించేలా చేశాడు. ముఖ్యంగా 2016 ఎడిషన్ సెమీ ఫైనల్లో అతడి విధ్వంసకకాండను భారత అభిమానులు మర్చిపోలేరు. ఆ మ్యాచ్‌లో 42 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడీ డాషింగ్ బ్యాటర్. అందుకే ఆ ఇన్నింగ్స్, ఆ విజయం తనకు మరపురానిది అని వెల్లడించాడు రస్సెల్. ప్రమాదకర ఆటగాడిగా పేరొందిన విండీస్ స్టార్ జమైకా టీ20 లీగ్‌తో మూడు ఫార్మాట్ల నుంచి వైదొలగనున్నాడు.

# ఇంగ్లండ్ వేదికగా చిరకాల ప్రత్యర్థుల ఫైట్..

### ఆదివారం ఫ్యాన్స్‌కు పూనకాలే.?



క్రికెట్‌లో ఫార్మాట్ ఏదైనా సరే భారత్ , పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజ్ తెలిసిందే. వరల్డ్ కప్ వంటి ఐసీసీ టోర్నీల్లో అయితే దాయాదుల మ్యాచ్ రోజు స్టేడియాలు కిక్కిరిసిపోవాల్సిందే. అయితే.. ఆపరేషన్ సిందూర్ తర్వాతి ఇరుజట్ల మధ్య క్రికెట్ అనే మాటే కరువైంది. ఈ నేపథ్యంలో ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించేందుకు సిద్ధమవుతున్నారు క్రికెటర్లు. అవును.. త్వరలో జరుగబోయే 'వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్' లీగ్‌లో వెటరన్ ఆటగాళ్లతో కూడిన ఇండియా ఛాంపియన్, పాకిస్థాన్ ఛాంపియన్ జట్లు తలపడనున్నాయి. దాంతో, మ్యాచ్ వేదిక ఎక్కడ? ఎప్పుడు మొదలవుతుంది? లైవ్ స్ట్రీమింగ్ ఎక్కడ చూడాలి? అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు ఫ్యాన్స్.ఒకప్పుడు మైదానంలో కొదమ సింహాల వలె 'నువ్వా నేనా' అన్నట్టు ఎదురుపడిన పాక్, టీమిండియా క్రికెటర్లు ఇప్పుడు మరోసారి తమ పోరాటంతో ఫ్యాన్స్‌ను అలరించేందుకు సిద్ధమయ్యారు. ప్రతిష్ఠాత్మక వరల్డ్ ఛాంపియన్‌షిప్ లెజెండ్స్ లీగ్ రెండో సీజన్‌లో జూలై 20 ఆదివారం నాడు ఇంగ్లండ్ వేదికగా ఇండోపాక్ క్రికెట్ సమరం జరుగనుంది. బర్మింగ్‌హమ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానం ఈ ఉత్కంఠ పోరుకు వేదిక కానుంది.మాజీ ఆటగాళ్లు యువరాజ్ సింగ్, శిఖర్ ధావన్, సురేశ్ రైనా, రాబిన్ ఉతప్ప, అంబటి రాయుడులతో భారత జట్టు బ్యాటింగ్ లైనప్ పటిష్ఠంగా ఉంది. వినయ్ కుమార్, అభిమన్యు మిథున్, సిద్ధార్థ్ కౌల్, వరుణ్ అరుణ్‌లతో కూడిన పేస్ దళం కూడా బలంగానే కనిపిస్తోంది. ఇక వెటరన్లు హర్భజన్ సింగ్, పీయూష్ చావ్లాలు తమ స్పిన్‌తో పాక్ బ్యాటర్లను బోల్తా కొట్టించేందుకు సిద్ధమవుతున్నారు. భారత్, పాక్ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో లైవ్ స్ట్రీమింగ్ చూడొచ్చు.

# స్పోర్ట్స్

## షమీకి కమ్‌బ్యాక్ కష్టాలు.. దేశవాళీ క్రికెట్‌పైనే గంపెడు ఆశలు..!



ఒకప్పుడు ప్రధాన పేసర్‌గా భారత జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన మహ్మద్ షమీ ఇప్పుడు చోటు కోసం ఎదురుచూస్తున్నాడు. మునపటి పేస్ పవర్ తగ్గడంతో అతడిని తీసుకునేందుకు సెలెక్టర్లు ఆసక్తి చూపించడం లేదు. ఐపీఎల్ 18వ సీజన్‌లో ఇంగ్లండ్ పర్యటన కు దూరమైన ఈ పేసర్ ఫామ్ చాటుకునేందుకు సిద్ధమవుతున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శనతో పునరాగమనం చేయాలని అనుకుంటున్నాడు. త్వరలో ప్రారంభం కానున్న దేశవాళీ సీజన్‌లో ఈ స్పీడ్‌స్టర్ బెంగాల్ తరఫున బరిలోకి దిగనున్నాడు.శనివారం బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ 50 మంది ప్రాబబుల్స్‌ను ప్రకటించింది. ఇందులో షమీతో పాటు ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న పేసర్ ఆకాశ్ దీ, బ్యాటర్ అభిమన్యు ఈశ్వరన్‌లు కూడా ఉన్నారు. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున అదరగొడుతున్న కుర్రాడు అభిషేక్ పొరెల్ సైతం ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాడు.



# బాలీవుడ్ లో శ్రీలీల జోరు

## ఆ స్టార్ హీరో పక్కన ఛాన్స్ కొట్టేసిన అమ్మడు..

పెళ్లి సందడి సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైన శ్రీలీల.. ధమాకాతో బ్లాక్ బస్టర్ హిట్టుకొట్టింది. ఈ సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీలో ఈ ముద్దుగుమ్మ పేరు మారుమోగింది. దీంతో ఈ బ్యూటీకి వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. ఒక్క ఏడాదిలోనే ఏకంగా అరడజనుకుపైగా సినిమాలతో ప్రేక్షకులను అలరించింది ఈ ముద్దుగుమ్మ. కానీ ఆ తర్వాత ఆమె నటించిన స్కంద, ఆదికేశ, ఎక్స్ట్రాఆర్డినరీ మ్యాన్, రాబిన్‌హుడ్ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్స్ అయ్యాయి. దీంతో ఈ బ్యూటీకి అవకాశాలు తగ్గిపోయాయి. వరుసగా ప్లాపులతో సతమతమవుతున్న టైంలోనే పుష్ప 2 చిత్రంలో కిస్సిక్ అంటూ స్పెషల్ పాటతో ఆకట్టుకుంది. ప్రస్తుతం తెలుగులో రవితేజతో మాస్ జాతర, పవన్ కళ్యాణ్ జోడిగా ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రాల్లో నటిస్తుంది. ఇటు తెలుగులో చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్న ఈ అమ్మడు.. ఇప్పుడు బాలీవుడ్ పై ఫోకస్ పెట్టింది.ప్రస్తుతం హిందీలో కార్తిక్ ఆర్యన్ సరసన ఓ లవ్ స్టోరీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇదివరకే ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్స్, సాంగ్స్ రిలీజ్ అయ్యాయి. ఇక ఇప్పుడు బాలీవుడ్ లో మరో ఆఫర్ కొట్టేసినట్లుగా తెలుస్తోంది. అతడు మరెవరో కాదు.. రణవీర్ సింగ్. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. రణవీర్ హీరోగా వస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటించనున్నట్లు టాక్. ఇప్పటికే ఆమెతో సంప్రదింపులు జరిపారని.. త్వరలోనే దీనిపై అఫిషియల్ అనౌన్స్మెంట్ రానుందని ప్రచారం జరుగుతుంది. ఈ చిత్రంలో బాబీ డియోల్ కీలకపాత్రలు నటిస్తున్నారు. రణవీర్ సినిమాతోపాటు శ్రీలీలకు హిందీలో మరిన్ని ఆఫర్స్ వస్తున్నట్లు సమాచారం.ప్రస్తుతం శ్రీలీల చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమె పర్సనల్ విషయాల గురించి నిత్యం ఏదోక రూమర్స్ ఫిల్మ్ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. బాలీవుడ్ హీరో కార్తిక్ ఆర్యన్ తో శ్రీలీల ప్రేమలో ఉందనే టాక్ నడిచింది. తాజాగా ఈ రూమర్స్ పై క్లారిటీ ఇచ్చింది. షూటింగ్ సమయంలో అమ్మ ఎప్పుడూ తనతో ఉంటుందని.. ఇంకా ప్రేమలో పడే అవకాశం ఎక్కడుంటుందని చెప్పింది.




# హిందీలో 'సామ్రాజ్య' పేరుతో రాబోతున్న విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్'

స్టార్ కథానాయకుడు విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'కింగ్‌డమ్'. ఈ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మిస్తున్నాడు. ఈ చిత్రం జూలై 31న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమాను హిందీలో విడుదల చేయట్లేదని కొన్ని రోజులుగా రూమర్స్ వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఈ రూమర్స్‌కి చెక్ పెడుతూ హిందీలో విడుదల తేదీని ప్రకటించారు. ఈ సినిమాను హిందీలో కూడా జూలై 31న విడుదల చేయబోతుండగా.. టైటిల్ మాత్రం ఛేంజ్ చేశారు. కింగ్‌డమ్‌కి బదులుగా ఈ చిత్రం సామ్రాజ్య పేరుతో హిందీలో విడుదల కాబోతుంది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రయూనిట్ కొత్త పోస్టర్‌ను పంచుకుంది.కింగ్‌డమ్ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ మూవీలో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నది. సత్యదేవ్ కీలకపాత్రలో నటిస్తున్నాడు. అనిరుధ్ రవిచంద్ర మ్యూజిక్ అందిస్తున్నాడు.

# మరో కొత్త బిజినెస్ స్టార్ట్ చేసిన సమంత..

## ఈసారి లగ్జరీగానే ప్లాన్ చేసిందిగా..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత పేరు కొన్ని రోజులుగా వార్తలలో నిలుస్తున్న సంగతి తెలిసిందే. సినిమాల గురించి కాకుండా నిత్యం డేటింగ్ వార్తలతో ట్రెండింగ్ లో ఉంటుంది. ఇండస్ట్రీకి వచ్చి 15 ఏళ్లు దాటినప్పటికీ ఇప్పటికీ ఏమాత్రం క్రేజ్ తగ్గలేదు. తెలుగు, తమిళంలో భాషలలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది.కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో సినిమాలకు దూరంగా ఉన్న సామ్.. ఇప్పుడిప్పుడే తిరిగి రీఎంట్రీ ఇస్తుంది. ఇటీవలే శుభం సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చింది. చిన్న సినిమాగా వచ్చిన శుభం బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ మౌత్ టాక్ సొంతం చేసుకుంది. మరోవైపు సామ్ ఇప్పుడిప్పుడే పలు ప్రాజెక్ట్ ఒప్పుకున్నట్లు సమాచారం.ఇదంతా పక్కన పెడితే కథానాయికగా, నిర్మాతగా రాణిస్తున్న సామ్.. ఇప్పుడు వ్యాపారరంగంలోకి అడుగుపెడుతుంది. ఇప్పటికే సాకి పేరుతో దుస్తుల వ్యాపారంలో పెట్టుబడులు పెట్టింది సామ్. ఇక ఇప్పుడు మరో కొత్త బిజినెస్ ప్లాన్ చేసిందట. ఇంతకీ సామ్ చేయబోతే న్యూ బిజినెస్ ఏంటో తెలుసుకుందామా.లేటేస్ట్ సమాచారం ప్రకారం సమంత ఇప్పుడు లగ్జరీ పెర్ ఫ్యూమ్ బిజినెస్ స్టార్ట్ చేసింది. ఇందుకు సంబంధించిన కాన్సెప్ట్ నుంచి బ్రాండింగ్ వరకు అన్నీ తానే దగ్గరుండి చూసుకుంటుందట. ప్రొడక్ట్ రెడీ అయ్యాక తానే బ్రాండ్ అంబాసిడర్ గా మారి మార్కెటింగ్ సైతం చేయాలని భావిస్తుందట.సినిమాలతోపాటు ఇకపై వ్యాపారాలపై సైతం సామ్ ఫోకస్ చేయాలని భావిస్తుందట. ఇక సామ్ ఒక్కో సినిమాకు భారీగా పారితోషికం తీసుకుంటుంది. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఎప్పటికప్పుడు లేటేస్ట్ ఫోటోస్ షేర్ చేస్తుంటుంది.




# రూ.100 కోట్లు ఇచ్చినా ఈ హీరోతో అస్సలు నటించను..

## నయనతార షాకింగ్ కామెంట్స్..



లేడీ సూపర్ స్టార్ నయనతార.. పాన్ ఇండియా లెవల్లో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్న హీరోయిన్. దక్షిణాదిలో అత్యధిక పారితోషికం తీసుకునే హీరోలలో ఆమె ఒకరు. తెలుగుతోపాటు తమిళం, హిందీలోనూ వరుస సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ.ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి హీరోగా డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న కొత్త ప్రాజెక్టులో నటిస్తుంది. ఇటీవలే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ అయ్యింది.అయితే రూ.100 కోట్లు ఇచ్చినప్పటికీ ఓ హీరోతో నటించనని ముఖం మీదే చెప్పేసిందట నయన్. ఇంతకీ ఆ హీరో ఎవరో తెలుసా.. ?ప్రస్తుతం చిరంజీవితోపాటు కేజీఎఫ్ స్టార్ యష్ నటిస్తున్న టాక్సిక్ చిత్రంలోనూ నటిస్తుంది. ఇవే కాకుండా తమిళంలో మరిన్ని సినిమాలకు సైతం నయన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వంద కోట్లు ఇచ్చినా ఆ హీరోతో నటించనని చెప్పేసిందట నయన్. ఇంతకీ అతడు ఎవరో తెలుసా.. అతడే శరవణన్.ది లెజెండ్ సినిమాతో హీరోగా వెండితెరకు పరిచయమయ్యాడు శరవణన్. 2022లో విడుదలైన ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. అయితే తన సినిమాలో నయనతారను కథానాయికగా తీసుకోవాలని భావించాడట. కానీ ఆ సినిమా అవకాశాన్ని నయన్ సున్నితంగా రిజెక్ట్ చేసిందని సమాచారం.ది లెజెండ్ సినిమాతో హీరోగా వెండితెరకు పరిచయమయ్యాడు శరవణన్. 2022లో విడుదలైన ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. అయితే తన సినిమాలో నయనతారను కథానాయికగా తీసుకోవాలని భావించాడట. కానీ ఆ సినిమా అవకాశాన్ని నయన్ సున్నితంగా రిజెక్ట్ చేసిందని సమాచారం.

# 'హరి హర వీరమల్లు' టికెట్ ధరల పెంపునకు ఏపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



స్టార్ నటుడు పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'హరి హర వీరమల్లు' సినిమా టికెట్ ధరల పెంపునకు ఏపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఈ చిత్రం జులై 24న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుండగా.. సినిమా విడుదలైన రోజు నుంచి 10 రోజుల వరకు రేట్లు పెంచడానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. మొదట రెండు వారాలు రేట్లు పెంచేందుకు అనుమతి ఇవ్వాలని చిత్ర నిర్మాతలు ప్రభుత్వాన్ని కోరగా.. ప్రభుత్వం తిరస్కరిస్తూ.. 10 రోజుల వరకే అవకాశం ఇచ్చింది. ఇక పెంచిన రేట్లను బట్టి చూసుకుంటే.. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒక్కో టికెట్‌పై లోయర్ క్లాస్‌కి రూ.100 అప్పర్ క్లాస్‌కి రూ.150 పెంచుకునే అవకాశం కల్పించారు. మల్టీప్లెక్స్‌లలో అయితే రూ.200 వరకు పెంచుకోవడానికి అనుమతి లభించింది. మరోవైపు టికెట్ ధరలను పెంచాలంటూ చిత్రబృందం తెలంగాణ ప్రభుత్వాన్ని కూడా కోరినట్లు తెలుస్తుంది. ఈ సినిమాకు క్రిష్, జ్యోతికృష్ణ సంయుక్తంగా దర్శకత్వం వహించగా.. నిధి అగర్వాల్ కథానాయికగా నటించింది. ఏఎం రత్నం నిర్మించారు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492